VISALAANDHRA, VIJAYAWADA—Phone No. 376

రిజిష్టరు నెం. 6097. 4 పేజీలు : ఒక అణా

విశాలాంధ్ర

సంపుటి 2 ★ విజయవాడ: సోమవారం; జూలై 20, 1953 ★ సంచిక 125

స్విట్జర్లాండులో టెన్సింగ్

జూరిచ్, జులై 18

గౌరీశంకర్ (ఎవరెస్టు) విజేత టెన్‌సింగ్, కుటుంబ సమేతంగా లండన్‌నుండి విమానంలో ఇక్కడికి వచ్చాడు. స్విట్జర్లాండులో పదిరోజులు గడిపేందుకు ఆయనవచ్చాడు.

నేడే చూడండి!

వినోదావారి

దేవదాసు

దర్శకత్వం: వేదాంతం రాఘవయ్య

కర్నూలు నిర్ణయాన్ని తిరగదోడటానికే లోక్‌పార్టీ నిర్ణయం

అసెంబ్లీలో తిరుపతి ప్రతిపాదనకు పార్టీ జనరల్‌బాడీ సమ్మతి

తమ సూచన ఓడిపోతే ఇతర సవరణలపై స్వేచ్ఛ ఇవ్వగలరట

మద్రాసు, జులై 19

కృషీకార్ లోక్‌పార్టీ జనరల్‌బాడీ నేటి ఉదయం 9 గంటలనుండి మధ్యాహ్నం 2 గంటలవరకూ ఇక్కడ సమావేశమై ఆంధ్ర రాజధానిగా తిరుపతి సవరణ ప్రతిపాదనకు అంగీకరిస్తూ తీర్మానించింది.

ఈ సవరణపై అసెంబ్లీలో ఓటింగు కోరడానికికూడా వీరు నిర్ణయించారు. కాంగ్రెసుపార్టీవారు తిరుపతి సూచనకు అంగీకరించని పక్షంలో వోటింగు స్వాతంత్ర్యం కోరాలని కూడా నిశ్చయించుకున్నారు.

నేటి సమావేశానికి ఆచార్యరంగా అధ్యక్షత వహించారు. ప్రప్రథమంలో జనసంఘం నాయకుడు డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ స్మృతికి సంతాపం వెల్లడిస్తూ తీర్మానించారు. ఆటుతర్వాత గౌతు లచ్చన్నగారు ఆంధ్రరాష్ట్రానికి నెహ్రూ ప్రకటన జరిగినప్పటినుండీ నేటివరకూ జరిగిన కార్యకలాపాలను, కాంగ్రెస్‌తో, ప్రజాసోషలిస్టుపార్టీతో తమ పార్టీ జరిపిన సంప్రదింపులను సమీక్షించారట. కర్నూలునిర్ణయంపట్ల ప్రజలలో ఏర్పడిన తీవ్రమైనవ్యతిరేకత దృష్ట్యాయాతనంగా ఏర్పడినఅవకాశాన్ని లోక్‌పార్టీవారు తప్పకుండా సద్వినియోగం చేసుకోవాలని కూడా లచ్చన్నగారు నొక్కి చెప్పారట.

రంగాగారు మాట్లాడుతూ, రాజధాని తిరుపతిలో వుండాలని గట్టిగా కోరవలసి వుందని చెప్పారట. కర్నూలులో రాజధానికి సౌకర్యాలు కూడా లేవని కనుక అన్ని పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని కర్నూలు నిర్ణయాన్ని పునరాలోచించవలసిన అవసరం వుందని స్పష్టంచేశారట.

సమావేశానంతరం లచ్చన్నగారిని కలుసుకొని కాంగ్రెస్ పార్టీ నిర్ణయాలకు వ్యతిరేకంగా మీరు ఎలా నిర్ణయించగలరు? అని ప్రశ్నించగా, తాము ఆంధ్రలో సుస్థిరప్రభుత్వ నిర్మాణంలో తోడ్పడ్డం కోసమే కాంగ్రెసుతో చేతులు కలిపామని, కాంగ్రెసుపార్టీ నిర్ణయాలన్నింటికీ తాము కట్టుబడి వుండవలసిన అవసరం లేదని అన్నారు. "మాకు వేరే పార్టీ వుంది, మా పార్టీకి సమస్యలపై అభిప్రాయాలు ప్రకటించేహక్కువుంది" అన్నారు.

తిరుపతి శాసనసభ ఆమోదంపొందకపోతే ఏమిచేస్తారు అని ప్రశ్నించగా, తమ చర్చలకు సహాయకారిగా వుండదనే ఉద్దేశ్యంతో ఆ సమస్యపై ఆలోచనలు జరుపలేదన్నారు.

కాని అభిజ్ఞవర్గాలద్వారా అందిన సమాచారాన్నిబట్టి తిరుపతి ప్రతిపాదన ఓడిపోతే, విజయవాడ, గుంటూరు, విశాఖ ప్రతిపాదనలపై లోక్‌పార్టీ సభ్యులకు వోటింగు స్వేచ్ఛనివ్వ నిశ్చయించారని తెలుస్తున్నది.

తిరుపతి సవరణపైకూడా మీపార్టీ సభ్యులకు వోటింగు స్వేచ్ఛ ఇస్తారా అని లచ్చన్నగారిని ప్రశ్నించగా, ఆ సంగతి ఆలోచించలేదనీ, అయితే ఎవరైనా గట్టిగా అడిగితే స్వేచ్ఛ ఇవ్వడానికి కూడా సిద్ధమేనని చెప్పారు.

(వి. వి.)

"రష్యా శాంతిని కోరితే మాతో సహకరించాలి"

అమెరికా విదేశాంగ మంత్రి డల్లెస్ షరతు

వాషింగ్టన్, జులై 17

రష్యా నిజంగా శాంతినే కోరుతున్నట్లయితే, యూరప్ ఆసియా దేశాల విషయంలో పశ్చిమ రాజ్యాలు నిర్ణయించుకున్న కార్యక్రమంతో ఏకీభవించాలి, అని డల్లెస్ ఒక రేడియో ప్రసంగంలో అన్నాడు.

అమెరికా విదేశాంగమంత్రి డల్లెస్ ఈవేళ ఒక రేడియో ప్రసంగం గావించాడు. తూర్పు యూరప్ పరిస్థితులను పేర్కొంటూ "సోవియట్ పెత్తనం కింద వున్న దేశాలలో తీవ్ర అసంతృప్తి పెరుగుతూందనీ, దానితో సోవియటుకు సమస్య మూడుతూందనీ" వ్యాఖ్యానించాడు. (ఈ ప్రసంగం తొలిభాగాలు నిన్న ప్రకటించాము - సం)

బ్రిటిషు, ఫ్రెంచి విదేశాంగ మంత్రులతో తా నిటీవల జరిపిన సంభాషణల ఫలితాన్ని అమెరికా ప్రజలకు తెలిపేందుకు ఈ రేడియో ప్రసంగం ఉద్దేశించబడింది.

"ఒక్కవిషయం స్పష్టంగా చెప్పవలసి వున్నాను. అధ్యక్షుడు ఐసెన్‌హోవర్ నిర్ణయించిన విధానాల ఫలితంగా సోవియట్ దేశం బలహీనమయిపోయి ఊగిసలాడుతూంది. అటు స్వేచ్ఛా ప్రపంచం బలపడుతూంది" అని వ్యాఖ్యానించాడు.

"సోవియట్ ప్రభుత్వం నిజంగా శాంతిని కోరుతున్నట్లయితే, యూరప్ ఆసియా విషయాలలో మేము నిర్ణయించుకున్న కార్యక్రమంతో సహకరించాలి గాని, దానికి అంతరాయం కలిగించరాదు" అని డల్లెస్ అన్నాడు.

ఆస్ట్రియన్లను రెచ్చగొట్టే ధోరణి

ఆస్ట్రియాతో వెంటనే శాంతిసంధి చేసుకోవడానికి సోవియట్ ఒప్పుకోవాలనీ, లేకపోతే ఆదేశ ప్రజలు రెచ్చిపోయి ఏమయినా చేయవచ్చునని డల్లెస్ అన్నాడు. ఆస్ట్రియన్లు అప్పుడే ఆవేశంతో రెచ్చిపోతున్నారన్నాడు.

ఇండోచైనా ప్రజలకు ఫ్రాన్సుతోవిడిపోవాలబి లేదట

విదేశాంగ మంత్రుల సమావేశం సందర్భంలో, ఇండోచైనాలోని వియత్నాం, కాంబోడియా, లావోస్ ప్రభుత్వాల ప్రతినిధులతో తాను ప్రసంగించానన్నాడు. "తమ సర్వతంత్ర స్వతంత్ర ప్రతిపత్తిని సమగ్రం చేసుకునేయత్నం వారు" ఫ్రాన్సు సహకారాన్ని కోరుతున్నారన్నాడు. ఫ్రాన్సుతో సాంస్కృతికంగా, ఆర్థికంగా, సైనిక రీత్యా బలమైన సంబంధాలుగల ఆప్రజలు ఆదేశంతో ఇప్పుడు తెగతెంపులు కోరడం లేదనీ తాను స్పష్టంగా" గ్రహించాడట.

డెల్టా గ్రామాలలో చౌకడిపోలు

ఏలూరు, జులై 1

తూర్పు, పశ్చిమ గోదావరులలోను కృష్ణాజిల్లాలోను డెల్టా గ్రామాలలో కూడా చౌకడిపోలు యేర్పాటుచేయవలసిందిగా మద్రాసుప్రభుత్వం ఈజిల్లా కలెక్టర్లకు ఉత్తర్వులు పంపించింది.

డిపోలలో పెద్దలకు మనిషికి రోజు 1 కి 4 ఔన్సులబియ్యం, 6 ఔన్సులు గోధుమ లేక జొన్నలు యివ్వబడతాయనికూడా ఆప్రకటనలో తెలియజేయబడింది.

నేపాల్‌లో భారతప్రభుత్వ పోలీసు చర్య!

తిరుగుబాటుదారుల నణచేందుకు యు. పి. సాయుధ దళాల ప్రయాణం

డెల్హీ, జులై 18

ఇటీవల నేపాల్‌లో జరిగిన తిరుగుబాటును అణచివేయడంకోసం ఉత్తర ప్రదేశ్ సాయుధ పోలీసు దళాలు నేటి ఉదయం సరిహద్దు దాటి నేపాళ భూభాగంలో ప్రవేశించాయి.

ఈ తిరుగుబాటును అణచడంకోసం భారత నేపాళ ప్రభుత్వాలు రెండూ కలిసి సంయుక్త చర్యలు తీసుకోవాలని ఇటీవల ఉభయ ప్రభుత్వాధికారులూ కలిసి సంప్రతింపులు జరిపి మీదట ఈ నిర్ణయానికి వచ్చారు.

ఇటీవల డాక్టర్ కె. వి. సింగ్ అనుచరుడైన శ్రీ భీమదత్తపాత్ నాయకత్వాన కొంతమంది ఒక నేపాళ నగరాన్ని వశం చేసికొన్న విషయం మరొక నగరాన్ని పట్టుకొనడానికి సన్నాహాలు సాగిస్తున్న విషయం 'విశాలాంధ్ర' పాఠకులకు విదితమే.

ఇప్పుడు ఉత్తరప్రదేశ్ సాయుధ దళాలు ప్రమాదం వాటిల్లనున్న ధనగరీ నగరంవైపు సాగుతున్నాయి. ఈనగరంలో "బడాహాకిం" అనేనేపాళ రాజప్రతినిధి ఒకరు ఉంటున్నారు. ఆయన అధీనంలో 35 మంది సాయుధ సిపాయీలు కూడా వున్నారు. తిరుగుబాటుదారులువారికి స్వాధీనమైనబిల్లోరి నగరంనుంచి బయలుదేరి ధనగరీ మధ్యే మార్గంలో వున్నట్లు తెలుస్తోంది.

ఇండియాలో విదేశ స్థావరాలు

మనదేశ భద్రతకు ప్రమాదమని నెహ్రూ ఉద్ఘాటన

అల్లాహాబాద్, జులై 18

ఇండియాలోని విదేశ స్థావరాలు మనదేశ భద్రతకు ఎంతో ప్రమాదంగా పరిణమించాయని నేడిక్కడ బహిరంగ సభలో ప్రసంగిస్తూ ప్రధానమంత్రి శ్రీ నెహ్రూ స్పష్టంచేశారు.

ఎప్పుడో గతంలో చేసుకొన్న ఒడంబడికలను ఆధారం చేసుకొని ఈ స్థావరాల విషయమై తమకగల హక్కులను గురించి పోర్చుగీస్ ప్రభుత్వం రాయబారులు సాగించడం హాస్యాస్పదమనికూడా నెహ్రూ తెలియజేశారు.

కలకత్తా సంఘటనలను శ్రీ నెహ్రూ ఖండిస్తూ యువకులంతా మహాత్మా గాంధీ సిద్ధాంతాలను అనుసరించాలని ఉద్బోధించారు.

దారిద్ర్యం, నిరుద్యోగం, లేని బలమైనదేశంగా ఇండియాను అభివృద్ధి చేయడానికి అందరూ సహాయపడాలన్నారు.

చైనాను గురించి శ్రీ నెహ్రూ ప్రస్తావించి ఆదేశాన్నుండి మనం నేర్చుకోవలసిన విషయాలు అనేకం ఉన్నాయన్నారు. అలాగే చైనా కూడా ఇండియా నుండి నేర్చుకోవలసినది చాల ఉన్నదన్నారు.

భూసమస్యా పరిష్కారాన్ని గురించి ప్రస్తావించి జమీందారీ విధానాన్ని రద్దుచేసినంత మాత్రానే అది పరిష్కారం కాదన్నారు.

ఆచార్య వినోభాబావే ప్రారంభించిన భూదాన ఉద్యమం ప్రపంచంలో ఒక మహత్తర ఉద్యమంగా శ్రీ నెహ్రూ ఉద్ఘాటించారు.

జానూభాయి పటేల్ అనే ఒక పాతికేళ్ళ యువకుడు దేశమంతా సైకిలుపై పర్యటిస్తున్నాడు.

తూర్పు జర్మనీ ప్రజలకు సంపూర్ణ భావప్రకటన స్వేచ్ఛ

బెర్లిన్, జులై 18

"తమ అభిప్రాయాలను బహిరంగా స్వేచ్ఛగా వెల్లడిచేయగల హక్కు తమకు కలదన్న విషయాన్ని తూర్పు జర్మనీలోని ప్రతిపౌరుడు గుర్తించాలి" అని తూర్పు జర్మనీ ప్రజాప్రభుత్వ ప్రధాని ఆటో గ్రోట్వాల్ నేడు తెలిపాడు.

"తాను పలికే పలుకులు కఠోరమైనవే అయినప్పటికీ, తూర్పు జర్మనీలోని ప్రతి పౌరునికీ నోరెత్తి మాట్లాడగల హక్కు పూర్తిగా ఉంది" అని తూర్పు జర్మనీ విలేఖరులతో ఆయన అన్న విషయాన్ని, తూర్పు జర్మనీ వార్తా సంస్థ ప్రకటించింది.

తూర్పు జర్మనీ ప్రభుత్వ విధానంలో ఇటీవల ప్రకటించబడిన మార్పులు ఏవో తాత్కాలికమైనవి కావనీ, అని చాల ముఖ్యమైన మార్పులనీ ఆయన వివరించాడు.

అజర్‌బైజాన్ కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి బర్తరఫ్

లండన్, జులై 18

సోవియట్ యూనియన్ లోని, అజర్‌బైజాన్ రిపబ్లిక్ కమ్యూనిస్టుపార్టీ ప్రధానకార్యదర్శి అయిన డి. బాగిరోవ్, "తనకర్తవ్యాలనుఉల్లంఘించిన" నేరానికి, ఆపదవినుంచి తొలగించబడినవార్తను మాస్కో రేడియో ప్రకటించింది.

అజర్‌బైజాన్ కమ్యూనిస్టుపార్టీ కేంద్ర కమిటీ, బాకూ పట్టణ కమిటీల సంయుక్తసమావేశం ఇటీవల బాకూలో జరిగింది. బాగిరోవ్‌ను తొలగించాలనే నిర్ణయం ఆ సమావేశంలో జరిగింది.

కేరళ పంచాయితీలలో కాంగ్రెసు తీసికట్టు!

నూటికి 44 పంచాయితీలు అభ్యుదయ వాదులైన స్వతంత్ర అభ్యర్థుల కైవసం

తిరువేంద్రం, జులై 18

తిరువాన్కూరు కొచిన్ రాష్ట్రంలో పంచాయితీ ఎన్నికలు పూర్తిఅయాయి. ఈ ఎన్నికలలో కాంగ్రెసు చలుకుబడి ప్రత్యేకంగా దెబ్బతిని పోయింది. అని ఎన్నికల ఫలితాలవల్ల స్పష్టమౌతున్నది.

రాష్ట్రంలో మొత్తం 589 పంచాయితీలలోనూ కాంగ్రెసు నూటికి 46 మాత్రమే గెలుచుకొనగలిగింది. కమ్యూనిస్టులు, తదితర వామపక్షాల వారూ చేరి స్వతంత్రులుగా పోటీచేసి నూటికి 44 పంచాయితీలను సంపాదించుకొన్నారు.

మిగతా పదివంతుల్ని ఈ స్వతంత్ర వర్గంతో చేరని ప్రజాసోషలిస్టులు, రివల్యూషనరీ సోషలిస్టులు, కేరళసోషలిస్టులు, తిరువాన్కూర్ తమిళనాడు కాంగ్రెసువారూ కలిసి పంచుకున్నారు.

పోటీ సర్వత్రా కాంగ్రెసువారికీ స్వతంత్రులకూ మాత్రమే జరిగింది. మొత్తం పంచాయితీలకు గల 436. స్థానాలలోనూ 364 స్థానాలకు ప్రజాసోషలిస్టులు పోటీచేసి 110ని మాత్రమే గెలవగలిగారు. రెండేరెండు పంచాయితీలలో వారికి మెజారిటీవచ్చింది. ఇంకా 11 పంచాయితీల ఫలితాలు రావలసి వున్నది.

గండకి నది వరదలు

ముజఫ్ఫర్‌పూర్, జులై 18

ఉత్తర ప్రదేశ్‌లోని గండకి, బాగ్మతి, లఖాండేరులు వరదలైనాయి. ముజఫ్ఫర్‌పూర్ జిల్లాలోని అనేక గ్రామాలను ముంచెత్తుతున్నాయి. ఈ వరదల వల్ల చాల రోడ్లు మునిగిపోయాయి. కొన్ని గ్రామాలలో పంటలు కూడా పూర్తిగా కొట్టుకుపోయినట్లు వార్తలు వస్తున్నాయి.

పాకిస్తానుకు కూడా పంచవర్ష ప్రణాళిక

ప్రణాళికా సంఘ నిర్మాణానికి నిర్ణయం

కరాచీ, జులై 18

పాకిస్తాన్ స్టేట్ బ్యాంకి గవర్నరు జాహిద్ హుసేన్ అధ్యక్షతన ఒక ప్రణాళికాసంఘాన్ని ఏర్పరచడానికి పాకిస్తాన్ ప్రభుత్వం నిర్ణయించింది.

ఈసంఘంలో ఇంకో ఇద్దరు సభ్యులుంటారు. వీరి పేర్లను ప్రభుత్వం తర్వాత ప్రకటిస్తుంది.

ఈ సంఘం చేయవలసిన పనులు యివి:

1. స్వాతంత్ర్యం వచ్చిననాటినుంచి యింతవరకు కలిగిన అభివృద్ధి సమీక్ష.

2. 1954 నుంచి అయిదేళ్ళవరకూ పేసే అభివృద్ధి పథకాలకు సహజసంపద మానవశక్తి ఎంతవరకూ లభ్యమౌతుందో అందనా వేయడం.

3. ఈ వనరులను పూర్తిగా వినియోగించుకొని ప్రభుత్వం పెట్టుకొన్న ఆర్థిక సాంఘిక లక్ష్యాల సంధికొనడాని కనువైన పంచవర్ష ప్రణాళికను తయారు చేయడం.

4. ఈ ప్రణాళికను అమలు జరిపేందుకు తగిన యంత్రాంగాన్ని గురించి సలహా యివ్వడం.

5. ఈ ప్రణాళిక సఫల మవడానికి ఇంకా ఏవైనా సూచనలుంటే వాటిని ప్రభుత్వానికి తెలపడం.

అనలు లోగడ1948 లో ప్రభుత్వం ఒక అభివృద్ధి సంఘాన్ని నియమించింది ఈ సంఘంవారు ఒక మచ్చవర్ష ప్రణాళికను తయారు చేశారు కాని ఇటీవలనే ప్రధాని మహమ్మదాలీ దానిని తీవ్రంగా విమర్శించారు.

కొత్తగూడెం బొగ్గుగని సమ్మె విచ్ఛిత్తికై కాంగ్రెసువాయకుల పాట్లు

కార్మిక ద్రోహానికై అధికారులతో యజమానులతో కుట్రలు

కొత్తగూడెం, జులై 19

వరంగలుజిల్లా కాంగ్రెసు కమిటీ అధ్యక్షుడు బొమ్మగంటి సత్యనారాయణ, స్థానిక కాంగ్రెసు నాయకులు 26 రోజులుగా శాంతంగా జరుగుతున్న సమ్మె విచ్ఛిన్నం చేయడానికై రెండు రోజులుగా డిప్యూటీ కలక్టరు మొదలయిన అధికారులతోనూ కంపెనీ జనరల్ మేనేజరుతోనూ గుసగుసలాడుతున్నారు. ఈ గుసగుసల ఫలితాలే నేటి టియర్‌గ్యాస్ ప్రయోగం, లాఠీఛార్జీలు, అరెస్టులు.

వరంగలుజిల్లా కాంగ్రెసుఅధ్యక్షుడు బొమ్మగంటి సత్యనారాయణ, స్థానిక కాంగ్రెసువాదులు తమ్మిశెట్టి రాములు, వేముల లక్ష్మీనారాయణ మొదలగు వారు కొత్తగూడెం సమ్మెను విచ్ఛిన్నం చేయడానికై మూడురోజులుగా తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు.

పది, పన్నెండువేలకుంది గనికార్మికులు ఎంతో ఐక్యతను, శాంతియుతగా సమ్మెను సాగించాలనే పట్టుదలను చూపుతున్నారు. వారిని చీలదీయడానికై కాంగ్రెసు విచ్ఛిన్నకుల ప్రయత్నాలేవీ ఫలించలేదు. అందుచేత కార్మికులకు సమిష్టిగా వ్యవహరించగల అవకాశాలను తొలగిస్తే తప్ప తమ విచ్ఛిన్న విధానాలు ఫలించవని అధికారులతో మంతనాల నాడాకనే 14వ తేదీన సమ్మె ప్రశాంతంగా జరుగుతున్నా 144 సెక్షన్ ప్రకటించారు.

తర్వాత ఈ కాంగ్రెసువాదులు కంపెనీ జనరల్ మేనేజరును కలసుకొన్నారు. డిప్యూటీ కలెక్టరు గనికాయలో కార్మిక పేటలలో ఇంటింటికీ వెళ్ళి ప్రచారం ప్రారంభించారు.

కార్మిక సంఘం కమ్యూనిస్టుల పలుకుబడిలోవుంది గనుకనే కంపనీ కార్మికుల కోరికలను నిరాకరిస్తూందనీ, వెంటనే పనిలోకి వెడితే మనిషికి 15 రూపాయలు అడ్వాన్సు యిప్పిస్తామనీ కార్మికులకు ఆశలు పెట్టారు. వారితోనే వాదన పెట్టుకొన్నవారి పేర్లు పోలీసులకు అందచేయడం, ఆ యిళ్ళకు వచ్చి పోలీసులు హడావిడి చేయడం సాగించారు.

ఇన్ని తంటాలుపడ్డా 18 వ తేదీ ఉదయం 10-15 మంది గనికూలీలను మాత్రం పనులలోకి పంపగలిగారు.

ఈ దొంగకూలీలు గనులలోనుంచి సాయంకాలం తిరిగివచ్చేసరికి కార్మికస్త్రీలు వారిని నిరసిస్తూ ప్రదర్శనంతో ఎదుర్కొన్నారు. ఒక దొంగకూలీ తన సిగ్గులేని తనాన్ని దాచుకోలేక ప్రదర్శనంలో కలిసిన తనభార్యను పట్టుకొని కొట్టాడు. దానిపైమిగిలిన స్త్రీలు ఆమె కాపాడి ఆ ద్రోహిపై చీపురు కట్టలు దులిపారు. పోలీసులు వెంటనే కార్మిక స్త్రీలపై ముమ్మరంగా బాష్పవాయువును ఉపయోగించారు. కాని, స్త్రీలు తడిగుడ్డలతో మొగాలు తుడుచుకొంటూ బాష్పవాయువును ప్రతిఘటించారు.

ఈమారు పోలీసులు కుడి ఎడమలు లేకుండా లాఠీలను ఉపయోగించారు. డిప్యూటీ కలక్టరు, జిల్లా పోలీసు సూపరింటెండెంటు కూడ దగ్గరవుండి ఈ దౌర్జన్యాలను పురికొల్పారు.

తర్వాత పోలీసులు ఇళ్ళలో దూరి, కొట్టి, దొరికిన వారందరికీ అరెస్టు చేశారు. ముప్పయిమంది కార్మికసంఘ కలంటీర్లను, ఇద్దరు కార్యకర్తలను, ఇరవయి మంది స్త్రీలను అరెస్టుచేశారు. స్త్రీలను తర్వాత వదిలివెట్టారు. మిగిలిన వారిని రాత్రి బండిలో వరంగలు జైలుకు తీసుకువెళ్ళారు.

లాఠీచార్జిలో మూడవ ఇంజనీయిను కన్న 58 ఏళ్ళ ఎలుకలపల్లి దుర్గమ్మ అనే స్త్రీ లాఠీచార్జిలో తీవ్రముగా గాయపడింది.

శ్రీమతి ముక్తాబాయి అనే కార్మిక స్త్రీ యింట్లోకి పోలీసులు జొరబడి ఆమె కోడల్ని, పంటిపిల్లతెల్లిని కొడుతూ, ఇంట్లోకి ఈడ్చుకుపోయారు. ఆమె సెందుకు కొడుతున్నారని అడిగినందుకై 70 ఏళ్ళ ముసలి ముక్తాబాయిని చితుకకొట్టారు.

శ్రీ గోళ అరవపల్లి యనే వలంటీరును పోలీసులు బూటు కాళ్ళతో తన్ని హింసించి అరెస్టుచేశారు. అరెస్టుచేసిన వారికి తిండిపెట్టలేదు.

డిప్యూటీ కలక్టరు, పోలీసు సూపరింటెండెంటు యూనియను నాయకులను, కార్యకర్తలను బూతులు తిడుతూ, దగ్గరుండి పోలీసులచేత కొట్టిస్తున్నారు. వారి ప్రక్కన నిలబడి కాంగ్రెసు నాయకులు పేరు పేరున కార్మిక నాయకులను చూపుతున్నారు.

యుద్ధ విరమణ సంధి సంతకాలపై వెంటనే చర్చలకు సిద్ధం

ఉత్తర కొరియా ప్రతినిధుల ప్రకటన

పాన్‌ముంజాను, జులై 19

కొరియా యుద్ధ విరమణ ఒడంబడికపై సంతకాలు చేసేందుకు తగిన చర్యలకు గురించి వెంటనే చర్చించడానికి తాము సిద్ధంగా ఉన్నామని ఉత్తరాది ప్రతినిధులు నేడు తెలిపారు.

నేడు యుద్ధవిరమణ చర్చలు తిరిగి ప్రారంభమైనప్పుడు ఉత్తరాదివారు ఈప్రకటనను అమెరికన్ ప్రతినిధులకు అందజేశారు. అమెరికావారు దానిని ప్రకటించారు. సింగ్మన్ రీని గురించి అమెరికా అధికారులిచ్చిన హామీ, చిత్తశుద్ధితో కూడుకున్నదిగా తాము స్వీకరిస్తున్నామని ఉత్తరాదివారు తెలిపారు.

అమెరికన్ రేడియోలు ఈవార్తను దేశమంతటా ప్రచారించాయి.

"ఇందుకు సమ్మతించినప్పటికీ, యుద్ధవిరమణకు భంగం కలిగినట్లయితే ఆత్మరక్షణ చేసుకునేహక్కు తాము పూర్తిగా కలిగి ఉంటామని ఉత్తరాదివారు స్పష్టం చేశారు"ని ఒక రేడియో విలేఖరి తెలిపినట్లు వాషింగ్టన్‌వార్త.

అమెరికన్ విమానాల విచ్చలవిడి దాడులు

ఉత్తర కొరియా ప్రాంతాలపై

అమెరికన్ విమానాలు నిన్న 1,500 సార్లు దాడులుచేసి, మొత్తం 22 లక్షల పౌనులు బరువుగల బాంబులను కురిపించాయట. దక్షిణ కొరియా సేనలు ముందుకు సాగుతున్నాయనీ, వాటికి సహాయంగానే ఈ విమాన దాడులు జరిగాయనీ, అమెరికన్ వైనికాధికారి విలేఖరులకు తెలిపాడు. యుద్ధవిరమణ వార్తలపై అమెరికావారు పూర్తి నిమేషం అమలు జరిపినందున, ఈ ఉద్యోగి యుద్ధవిరమణ నిశేషాలు తెలుపుతుంటాడు.

యుద్ధవిరమణలో ఉత్తరాదివారు పెద్ద ఎత్తున విఘ్నాలు కలిగించే సూచనలున్నాయని అమెరికావారు కంగారుపడుతున్నారు. యుద్ధవిరమణలో ఈ మధ్య ఎక్కువ తీవ్రంగా ఉత్తరాది సేనలు, పరస్పర సమన్వయంతో దాడులు జరిపాయని తెలుస్తుంది.

దారిద్ర్య దేవతకు ఐదుగురు పిల్లలబలి

కొట్టాయం, జులై 18

దారిద్ర్య బాధను భరించలేక తన ముద్దు బిడ్డలయిన ఆరుగుర్ని ఒక అభాగ్యుడు గతలేక హత్యచేసినట్లు కొత్త మంగళంనుంచి ఇక్కడికొక హృదయ విదారక వార్త చేరింది.

దారిద్ర్యం, నిరుద్యోగం మూలంగా ఒక వ్యక్తి తన పిల్లలకు తిండి పెట్టలేక పోయాడు. ఆకలికి అలమటించే వారిబాధనుకూడా చూడలేకపోయాడు. అందుకని నేడు తిక్కుతోచక ఒకరొక్కరుగా తన అయిదుగురు పిల్లలను ఒక పెద్ద బావిలోకి విసిరివేసి తుదకు తానుకూడాపడి ఆత్మహత్య చేసుకోడానికి ప్రయత్నించాడు. కాని ఆప్రయత్నం ఫలించలేదు. ఎవరోచూసి ఆ అభాగ్యుని బావిలోంచి వెలికి తీసి పోలీసులకు అప్పచెప్పారు. పిల్లలు మాత్రం మునిగిపోయారు.

జకార్తా, జులై 18

ఇండోనేషియాలో నూతన మంత్రివర్గ నిర్మాణానికి తన ప్రయత్నాన్ని సూర్యమీనాన్ గ్రీ నాయకుడైన డాక్టరు సుకిమాన్ విజయప్ మానుకున్నాడు.

ఇండోనేషియాలో 46 రోజుల క్రితం మంత్రివర్గసంక్షోభం ఏర్పడింది. అప్పటినుండి నూతన మంత్రివర్గ నిర్మాణానికి ప్రయత్నించినవారిలో డాక్టర్ సుకిమాన్ నాలుగవవాడు.

"భావప్రకటనా స్వాతంత్ర్యం మన జన్మహక్కు. దానికి రాజ్యాంగం సంపూర్ణంగా అభయమిచ్చే వరకు విశ్రమించము"

విశాలాంధ్ర

20-7-53 సోమవారం

మన రాజధాని

ఆంధ్రజాతి ప్రయోజనాలకు, ఆంధ్రప్రజలలో అత్యధిక సంఖ్యాకుల అభీష్టాలకు వ్యతిరేకంగా కాంగ్రెస్, లోక్, ప్రజా సోషలిస్టుపార్టీలు కర్నూలును రాజధానిగానిర్ణయించాయి. ఈ నిర్ణయాన్ని గురించి పునరాలోచించాలని కమ్యూనిస్టుపార్టీ పదే పదే విజ్ఞప్తి చేస్తూ వచ్చింది. ఆంధ్ర జాతీయ దిన పత్రికలు నెత్తిన నోరు పెట్టుకొని అదే కోరికను వెలిబుచ్చుతూ వచ్చాయి. కర్నూలు నిర్ణయం ప్రజానీకాన్ని క్రోధావిష్టులను జేసింది.

ఒక్క ముక్కలో చెప్పాలంటే ఆంధ్రజాతి పురోభివృద్ధిని కాంక్షించే వారందరూ కర్నూలు నిర్ణయాన్ని పునరాలోచించాలనే అభిప్రాయాన్ని స్పష్టంగా ప్రకటించారు.

ఆంధ్రరాష్ట్ర బిల్లు మద్రాసు శాసనసభలో చర్చకు రావడంతో మన రాజధాని సమస్యను గురించి అట్టి పునరాలోచనకు మరో అవకాశం లభించింది.

కర్నూలును మార్చి తిరుపతిని రాజధానిగా నిర్ణయించాలని కృషికర్ లోక్ పార్టీవారు, విజయవాడగా నిర్ణయించాలని కమ్యూనిస్టుపార్టీ, గుంటూరు - విజయవాడగా నిర్ణయించాలని వావిలాల గోపాలకృష్ణయ్యగారు సవరణలను ప్రతిపాదించారు. అలాగే మరొక కృషికర్ పార్టీ సభ్యుడు రాజధాని విశాఖగా మార్చాలని సవరణ యిచ్చారు.

"కర్నూలు నిర్ణయం అతి తొందరగా, హడావుడిగా జరిగిందనీ, దానిని సభ్యులందరూ హృదయపూర్వకంగా అంగీకరించలేదనీ, కర్నూలులో రాజధానిని నెలకొల్పడానికి సర్కారు ప్రజలే గాక, రాయలసీమలో కూడా కొందరు అసమ్మతిని సూచిస్తున్నారనీ, అందువల్ల, ప్రజాభిప్రాయాన్ని అనుసరించి సర్కారు జిల్లాలవారికికూడా అందుబాటులో వుండే విధంగా శ్రీబాగ్ ఒడంబడిక మేరకు రాయలసీమలోనే మరొక ప్రదేశాన్ని నిర్ణయించడం ఉచితమనే అభిప్రాయంలో తమపార్టీ తిరుపతి"సవరణను ప్రతిపాదించిందని కృషికర్ పార్టీనాయకుడు లచ్చన్నగారు చెప్పారు. కర్నూలు నిర్ణయంవల్ల దేశమంతా గగ్గోలు పుట్టిందని రంగాగారన్నారు.

ఇదే విధంగా కొందరు కాంగ్రెసు శాసనసభ్యులుకూడా కర్నూలు నిర్ణయం ప్రజలలో తీవ్ర అసంతృప్తిని తెచ్చిపెట్టిందని, అందువల్ల అందరికీ అందుబాటులోవుండే కేంద్రపట్టణాన్ని రాజధానిగా నిర్ణయించడం అవసరమని కాంగ్రెస్ అధినేత సంజీవరెడ్డిగారితో వాదిస్తున్నారని తెలుస్తోంది.

వీటన్నింటిని బట్టి ఒక్కవిషయం స్పష్టమవుతోంది. కర్నూలు నిర్ణయానికి బాధ్యులయిన కృషికర్ పార్టీవారు, కొందరు కాంగ్రెసు వారు రాజధాని నిర్ణయాన్ని పునరాలోచించాలని కోరుతున్నారు. ఆంధ్రా కాంగ్రెసు లెజిస్లేచర్ పార్టీ సమావేశంలో రాజధాని సమస్యపై సభ్యులకు ఓటింగు స్వేచ్ఛవుండాలని కొందరు సభ్యులు కోరుతున్నారని, సంజీవరెడ్డిగారు మాత్రం దీనికి పూర్తిగా వ్యతిరేకంగావున్నారని నేటివార్తలు. ఆఖరి నిముషం వరకు కర్నూలు నిర్ణయాన్ని ప్రజలకుగాని, పార్టీ సభ్యులకుగాని చెప్పకుండా వున్న సంజీవరెడ్డిగారు కాంగ్రెసు సభ్యులకు వారి యిష్టం వచ్చిన పట్టణానికి ఓటుచేసే హక్కు ఇచ్చే పక్షంలో కర్నూలు నిర్ణయం ఎగిరి పోతుందని ఎంతగా భయపడుతున్నదీ దీనిని బట్టి తెలుసుకోవచ్చును.

ఆంధ్రశాసన సభ్యుల సమావేశంలో చేయబడ్డ నిర్ణయం దేశంలో ఎంత గగ్గోలు పుట్టించిందో చూచాము. తిరిగి ఇప్పుడుచేయబోయే నిర్ణయం అట్టి గగ్గోలుకు తావిచ్చేదిగా వుండకూడదు కాని కృషికర్ పార్టీవారు కర్నూలు నిర్ణయం ప్రజలకు గగ్గోలు పుట్టించిందనీ, సర్కారు జిల్లాల ప్రజలే గాక రాయలసీమలో కూడా కొందరు అసమ్మతి చూపుతున్నారనీ వివరిస్తూనే మరోప్రక్క ఎవరికీ అందుబాటులోలేని, ఒక మూలగా ఉన్న తిరుపతిని రాజధానిగా సూచిస్తున్నారు. చేసిన తప్పును దిద్దుకోవలసి వారు ఎవరైనా మరో తప్పు చేయరాదు.

"ప్రజాస్వామిక పార్టీలవారు" సవరణ ఇచ్చిన తిరుపతి, విశాఖపట్టణాలను గురించే చర్చించాలిగాని విజయవాడ, గుంటూరు పట్టణాలను గురించి చర్చించరా" దని సంజీవరెడ్డిగారన్నట్లు వార్త. అంటే కర్నూలు గాకపోతే విశాఖపట్టణాన్ని నిర్ణయించాలని సంజీవరెడ్డిగారి అభిప్రాయం. సంజీవరెడ్డిగారి ఈ విపరీత ధోరణిని కాంగ్రెసు సభ్యులు ఎంతవరకు వ్యతిరేకించి నిలబడతారో, తమ వోటు స్వేచ్ఛను ప్రజాభిప్రాయాని కనుగుణ్యంగా ఎంతవరకు వినియోగించుతారో చూడవలసియుంది.

నేడు రాజధాని సమస్య తిరిగి పరిశీలనకు వచ్చింది. ప్రాంతీయ దురభిమానాలకు, పార్టీ ప్రతిష్టలకు లోనుగాకుండా జరిగిన తప్పును సరిహద్దుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాం. అందరికీ అందుబాటులోవుండి రాజధానికి అన్ని హంగులు గల విజయవాడనే అన్ని పార్టీలవారు రాజధానిగా నిర్ణయించాలని కోరుతున్నాం.

రాజధాని సమస్య అసెంబ్లీలో వోటుకు రావడానికి ఇంకా 4 రోజులు వ్యవధి వుంది. ఈలోగా ఆంధ్ర ప్రజానీకం తమ తమ నియోజక వర్గాల శాసన సభ్యులపై ఒత్తిడి తీసుకురావాలి; విజయవాడకు ఓటు చేసేలా డిమాండు చేయాలి.

ఐ. రా. స. సాంకేతిక సహాయ కార్యక్రమం

పోలెండ్ సమ్మతి

ఐ. రా. సమితి, జులై 17

ఐ. రా. స. సాంకేతిక సహాయ కార్యక్రమంలో పాల్గొనడానికి పోలండ్ అంగీకరించింది. 3 లక్షల [illegible] (పోలిష్ వాలు) లను అనగా 27,273 పౌనులను ఈయ నిశ్చయించింది.

సోవియటు రూడా ఇదివరకే తన అంగీకారాన్ని తెలియజేస్తూ, 1953 సంవత్సరానికి 40 లక్షల రూబుల్సును ఈయ నిశ్చయించింది.

మద్రాసు జైళ్ళ పరిపాలన రిపోర్టు

అమెరికన్ కాన్సులేట్‌కు సప్లయిచేస్తున్నట్టు వెల్లడి

మద్రాసు, జులై 18

అమెరికన్ కాన్సులేట్ కార్యాలయంవారి కోరికపై జైళ్ళ పరిపాలనా రిపోర్టులు వారికి సప్లయి చేయబడుతున్నాయని నేడు మద్రాసు అసెంబ్లీలో జైళ్ళ మంత్రి కుట్టి కృష్ణన్ నాయర్ వెల్లడించారు.

రాష్ట్రంలోని జైళ్ళలో ఎంత మంది వామపక్ష పార్టీల ఖైదీలు వున్నారో అమెరికన్లు అడిగారా, అడిగితే వారికి ఆ సమాచారం అందజేశారా అని ప్రశ్నించగా, అలాంటి దేమీలేదని మంత్రి జవాబిచ్చారు. అలాంటి సమాచారం అడగడానికి అమెరికన్ కాన్సులేటుకు హక్కులేదన్నారు.

ముఖ్యమంత్రి జోక్యంకలిగించుకొని మాట్లాడుతూ, లెక్కలకు సంబంధించిన ఏ సమాచారమైనా తాము అడిగిన వారందరికీ సప్లయి చేస్తామని, ఐక్య రాజ్యసమితి లాంటి సంస్థలకు కూడా అలా సప్లయి చేయబడుతోందని తెలిపారు "మా పరిపాలన బహిరంగ పరిపాలన" అని చెప్పుకున్నారు.

నాగిరెడ్డి : వామపక్ష పార్టీలు, వాటి కార్యకలాపాలకు సంబంధించిన సమాచారం ఇవ్వడం కూడా ఈ బహిరంగ పరిపాలనలోకి వస్తుందా ?

రాజాజీ : అలాంటి సమాచారం ఎవరైనా అడిగితే మేము ఒప్పుకోము. అంతర్గతంగా రాజకీయ ప్రాముఖ్యత గల విషయాలపై విదేశ రాయబార కార్యాలయాలకు మేము సమాచారం ఇవ్వము. కేవలం ప్రాధాన్యతగలవిషయం కూడా విదేశ ఎజన్సీలకు అందజెయ్యము.

రంగస్వామి రెడ్డియార్ : మీరు సప్లయిచేస్తున్న సమాచారం లాంటిది విదేశ రాయబార కార్యాలయం వారు ఎవరైనా మనకు అందజేస్తున్నారా ?

ముఖ్యమంత్రి : మనము అడుక్కుండానే, అమెరికా, రష్యాలు మనపై వారి సాహిత్యం కురిపిస్తున్నారు.

ప్రశ్న : వామపక్ష పార్టీల పరిస్థితిపై మీరు ఎన్నడైనా అమెరికన్ కాన్సులేట్‌తో చర్చలు జరిపారా ?

ముఖ్యమంత్రి: అమెరికన్ కాన్సుల్, అమెరికన్ రాయబారులేగాక, సోవియట్ రాయబారిని కూడా నేను కలిశాను.

సంధ్యాల కాటన్ అండ్ గ్రాండ్ నట్ మార్కెట్ కమిటీ సమావేశం ఇటీవల ఆత్మకూరు నాగభూషణంపెట్టి గారి అధ్యక్షతను జరిగింది. కార్యదర్శిని మార్పు చేయాలని అధ్యక్షుడు ప్రతిపాదించిన తీర్మానాన్ని వ్యతిరేకిస్తూ సేతు మాధవరావు ప్రభృతులు ప్రసంగించారు. అనంతరం తీర్మానం ఓటింగుకు పెట్టబడి వీగిపోయింది.

1950 లో మైనంపాడు కాల్పులపై విచారణ

జరిపించాలని అసెంబ్లీలో కమ్యూనిస్టు సభ్యుల విజ్ఞప్తి : ముఖ్యమంత్రి నిరాకరణ

మద్రాసు, జులై 18

గుంటూరుజిల్లా మైనంపాడుకు చెందిన మాదల కోటయ్య, మాదల నరసయ్యగారలను 1950 లో పోలీసులు కాల్చి చంపిన ఘటనలపై నేడు అసెంబ్లీలో అనేక ప్రశ్నలు వేయబడినాయి.

వారిద్దరినీ పోలీసులు అరెస్టుచేసి వ్యానులో తీసుకు వెళ్ళుకుండగా తుపాకితో బయటకుదూకి పారిపోప్రయత్నించడంవలన పోలీసులు కాల్పులు జరిపారని, అప్పుడు వారు నశించారని ముఖ్యమంత్రి మాదల నారాయణస్వామిగారి ప్రశ్నకు జవాబిచ్చారు.

ముఖ్యమంత్రి సమాధానంలో యింకా యిలా వుంది :

"ఒంగోలు తాలూకా మైనంపాడు గ్రామంలో జరిగిన పోలీడీ, హత్యకేసు సందర్భంలో పోలీసులు వారిని 1950 సెప్టెంబరు 13 వ తేదీ సాయంత్రం 6 గంటలకు అరెస్టు చేశారు. వారికి తిండిపెట్టి పోలీసు కాపలాతో లారీలో రాత్రి పది గంటలకు ఒంగోలు తీసుకెళ్ళుకుండగా గుండ్లవాగు ప్రదేశం వద్దకువచ్చేసరికి అరెస్టు చేయబడ్డవారి నానుభూతిపరులు కొంతమంది రోడ్డుకు అడ్డంగా పెద్దపెద్ద బండలు పెట్టి లారీని ఆటకపరిచారు. వెంటనే మాదల కోటయ్య లారీనుండిదూకి ఒక పోలీస్ కానిస్టేబుల్ వద్దనున్న రైఫుల్ లాక్కొని దగ్గిరలోవున్న గుంటూరుప్రదేశం వద్దకు పారిపోయాడు. తరువాత రెండో ఖైదీ కూడ పారిపోప్రయత్నించగా సర్కిలు యిన్‌స్పెక్టరు కాల్పులకు ఆజ్ఞాపించాడు. పోలీసులు 7 రౌండ్లు కాల్చారు"

వారిద్దరూ చచ్చి పడిపోయారు. గుంటూరు కాలువన్న సానుభూతిపరులు పోలీసులు వెంబడించినా దొరకకుండా పారిపోయారు.

ఒంగోలు జాయింటు మేజిస్ట్రేటు విచారణ జరిపి పోలీసులు ఆత్మరక్షణకు కాల్పులు జరిపినట్లు నిర్ధారణగా తేల్చారు.

చేతులకు సంకెళ్ళతో తుపాకి ఎలా లాక్కోగలరు ?

నారాయణస్వామి : వారిద్దరూ అరెస్టు చేయబడ్డ తరువాత పోలీసు కాపలాలో చేతులకు సంకెళ్ళు తగిలించి తీసుకుని వెళ్ళగా 25 మంది పోలీసులు కాపలా వుండగా వారిద్దరూ తుపాకి లాక్కోగలిగారని పారిపోగలిగారని ప్రభుత్వం అనుకుంటున్నదా ?

జవాబు : సభ్యుడు చెప్పిన పోలీసుల సంఖ్యను గూర్చి నేను నమ్మను. పోలీసులు ఖైదీల చేతులకు సంకెళ్ళు వేసిందీ లేదీ చెప్పలేం. గౌరవ సభ్యులు ఆ ఘటన జరిగినప్పుడు ప్రత్యక్షంగా వుంటేతప్ప ఆయన చెప్పేదీ నమ్మడానికి వీలులేదు.

పిల్లలమర్రి : నన్ను ఆ రోజుల్లో అరెస్టుచేసి సంకెళ్ళు వేశారు. సంకెళ్ళు పద్ధతిమీద, పోలీసులను మోసగించడం మీద ఆధారపడి వుండివుంటుంది. ఖైదీలు సంకెళ్ళుండగా తుపాకి ఎలా లాక్కోడానికి వీలవుతుంది ? ప్రభుత్వం యీ ఘటనను విచారించడానికి ఒక విచారణ సంఘాన్ని వేస్తుందా ?

ముఖ్యమంత్రి : 1950 లో మైనంపాడులో పొగాకు మార్కెటింగు కమిటీ ఎన్నికలలో కమ్యూనిస్టులు ఓడిపోయారు. మాదల నారాయణస్వామి అనే కమ్యూనిస్టు 50 మంది మాదిగలను ప్రోగుచేసి ఆయుధాలిచ్చి దోపిడీ చేయించి, యిళ్ళు తగులపెట్టించాడు.

నారాయణస్వామి : ముఖ్యమంత్రి చదివిన 3 పోర్టు తప్పుతడక. కేసు నాపైన నడచింది. వెంకటు సుబ్బయ్య దొరని అనే పోలీసు ఉద్యోగి వారిద్దరినీ కాల్చి చంపాక రు. 6000 లంచం పుచ్చుకున్నాడు. (సభలో గందరగోళం)

యలమందా రెడ్డి : వారిద్దరినీ కాల్చి చంపడానికి కారణం కమ్యూనిస్టులు బంధువులై వుండటం మాత్రమేనటగా?

జవాబు : నాకు ఆసంగతి తెలియదు.

పి. కె. గోపాలకృష్ణన్ : ఖైదీలు పారిపోయినప్పుడు పోలీసులకు ఎవరికైనా గాయాలు తగిలాయా?

జవాబు : ఘటనకు సంబంధించిన వివరాలు యిచ్చాను. ఇంతకంటే ఎక్కువ చెప్పలేను.

కోలా సుబ్బారెడ్డి : పోలీసు ఆఫీసరు పుచ్చుకున్న 6 నేలలోను 3 నేలు తిరిగి యిచ్చివేశాడు. మిగతాడబ్బుకూడ కడ్డీతోయివ్వకపోడు. ప్రభుత్వం నిష్పాక్షిక విచారణ జరుపుతుందా ?

జవాబు : అవినీతికి, లంచగొండితనానికి సంబంధించిన విచారణ అయితే ఆంధ్ర ప్రభుత్వం విచారణ జరపవచ్చు.

సిద్దన్న గౌడ్ :- పోలీసులు చుట్టూ కూర్చునివుండగా ఖైదీలు ఎలా హంపోగలిగారు ?

జవాబు : పోలీసులు కూర్చున్న పద్ధతిమీద, పోలీసులను మోసగించడం మీద ఆధారపడి వుండివుంటుంది.

పిల్లలమర్రి : ఖైదీలకు సంకెళ్ళు వేయబడ్డాయన్న సంగతి ప్రభుత్వం గమనించుతున్నదా?

జవాబు : ఎప్పుడో జరిగిన ఘటనలపై విచారణ జరపడం, జవాబులు చెప్పడం అసంభవం.

మాదాలనారాయణస్వామిగారు ఇది ముఖ్యమైన సమస్యగాబట్టి దీన్ని గూర్చి అరగంట చర్చకోరారు. స్పీకర్ తిరస్కరించారు. (వి. వి.)

శాంతిసంఘ సమావేశం ప్రారంభం: నెహ్రూ శాంతి ప్రయత్నాలను బలపరచాలని శ్రీ కిచ్లూ విజ్ఞప్తి

పాట్నా జులై 17,

ప్రపంచశాంతికై ప్రధాని నెహ్రూ చేస్తున్న కృషిని దేశంలోని శాంతి ప్రియులంతా బలపరచాలి అని అఖిలభారత శాంతి సంఘ అధ్యక్షులు డాక్టర్ సైఫుద్దీన్ కిచ్లూ నేడిక్కడ విజ్ఞప్తి చేశారు.

అఖిలభారత శాంతి సంఘ సమావేశం నేడిక్కడ ప్రారంభమైంది. తూర్పు పంజాబు, పెప్సూ, మధ్య భారత్, మధ్యప్రదేశ్, పశ్చిమబెంగాల్ ఆంధ్ర, బొంబాయి, యు పి. రాష్ట్రాల నుంచి సుమారు 40 మంది ప్రతినిధులు సభకు హాజరయ్యారు. బీహారు నుంచి 250 మంది సభ్యులు పాల్గొన్నారు.

డాక్టర్ కిచ్లూ యీ సమావేశాన్ని ప్రారంభిస్తూ ఇలా ప్రసంగించారు.

రష్యా శాంతిని, అమెరికా యుద్ధాన్ని కోరుతున్నాయి. ఈ ప్రపంచంలో శాంతియుత పద్ధతులద్వారా సాధింపజాలని విషయ మేదీలేదు. ప్రస్తుత ప్రపంచపరిస్థితి చాలా విషమంగావుంది. ఇటువంటి స్థితిలో కొంతమంది తమకు గల ధనాన్ని అందుబాటులో వున్న శాస్త్రజ్ఞానాన్ని ఉపయోగించుకొని దుర్బల జాతులపైన పెత్తనం చెలాయిద్దామని చూస్తున్నారు. కాలట్టి ఈ విషమపరిస్థితులు యుద్ధానికి దారితీసే ప్రమాదం వుంది.

స్వతంత్ర జాతులకు లంచాలిచ్చి వారిని యుద్ధ శిబిరంలోకి ఈడ్చి బానిసలను చేసుకొనడానికి కూడా ప్రయత్నాలు జరుగుతున్నాయి. నేను కొద్దిపాటి తెలివి లేటలున్న వారికి కూడా అమెరికనులు యుద్ధాన్ని కోరుతున్నారనే విషయం తెలిసిపోయింది. చైనా ప్రజాప్రభుత్వానికి ఐ. రా. స. లో స్థానం యివ్వాలని ఇండియా బ్రిటనులు చేస్తున్న ఘోషను అమెరికా పెడచెవి పెడుతూ పెడుతోంది ? రష్యాతో చర్చలు జరిపి ప్రపంచ సమస్యల్ని పరిష్కరించుకోవాలనే మాటలను ఎందుకు వినిపించుకోవడం లేదు ?

కొరియాలో కమ్యూనిస్టులు కాని 26 వేలమంది ఉత్తరాది ఖైదీల విడుదలలో అమెరికాకు పూర్తిగా పాలు వుంది. ఈ సంఘటన కనుచూపు మేరకు వచ్చిన యుద్ధ విరమణావకాశాన్ని భగ్నంచేసింది. అని డా. కిచ్లూ అన్నారు.

త్రివాత ప్రముఖ అభ్యుదయ నవలా కారుడు శ్రీ ముల్కరాజ్ ఆనంద్ ప్రసంగిస్తూ ఇలా అన్నారు.

మనదేశం శాంతిప్రియుల దేశం. బుద్ధుడు, అశోకుడు, నానక్, మీరాబాయి, తుకారాం, మహాత్మాగాంధీలు పుట్టినదేశం. చిరకాలంనుంచీ శాంతి వాంఛ ఈ దేశానికి సాంప్రదాయకంగా వస్తోంది. ఇప్పుడు తొలిసారిగా ప్రపంచశాంతి స్థాపనలో కీలకపాత్ర నిర్వహించే అవకాశం మనదేశానికి కలిగింది.

యుద్ధం జరగరాదు అని మనయువకతరంవారు నిశ్చయించినట్లయితే యుద్ధం రాదనే నమ్మకం నాకు వుంది.

వేయి అటంబాంబులైనా ఆసియా ప్రజల నణచజాలవు

తర్వాత పండిత సుందర్‌లాల్ ప్రసంగిస్తూ ఇలా అన్నారు :

కాశ్మీర్ సమస్య భారత పాకిస్తాన్ల మధ్య తగాదా సమస్య కాదు. కాగా చైనాపైదాడి చేయడానికి అనువుగా గిల్గిట్‌లో అమెరికావారు సైనిక స్థావరాలు నిర్మించుకొనే అవకాశం యివ్వాలా వద్దా అనే సమస్య అది. చైనా లోబడిపోతే ఇండియా ఎంతో కాలం స్వతంత్రంగా మనజాలదు.

ఒకవేళ యుద్ధమే వచ్చినట్లయితే ఇండియా తటస్థంగా వుండాలి. అయినా తటస్థంగా వుంటూనే ఆ యుద్ధంలో అపరాధులు ఎవరు అనే విషయాన్ని ఇండియా స్పష్టంగా తెలుసుకోవాలి. అయితే ఇకముందు యుద్ధం నేడివస్తే ఆయుద్ధాన్ని సృష్టించే అపరాధి అమెరికాయేనే విషయంలో నాకెట్టి సందేహమూలేదు.

రష్యావైపులు యుద్ధాన్నికోరడం లేదనే తన విశ్వాసాన్ని భారతి ప్రధాని నెహ్రూ ఇటీవల లండన్‌లో ప్రసంగిస్తూ వ్యక్తంచేశారు. శాంతిని పరిరక్షించే ప్రపంచ మహాపురుషులలో స్టాలిన్ ఒకరు అని భారత ఉపాధ్యక్షులు శ్రీ రాధాకృష్ణ వెల్లడించారు.

అమెరికావారు ఢిల్లీలో పార్లమెంటు సభ్యుల్ని కొనియేయడానికి డబ్బును ధారాప్రవాహంగా ఖర్చు పెడుతున్నారు. న్యూజిలాండు నుంచి అలాస్కావరకు అమెరికా ఒక సైనిక కుడ్యాన్ని నిర్మిస్తూంది. ఒక్కజపానులోనే అమెరికాకు 312 సైనికస్థావరాలున్నాయి.

కాని వేయి అటం బాంబులైనా శాంతి ప్రియులైన ఆసియా వాసులను లొంగదీయజాలవు అనే సత్యాన్ని అమెరికా గుర్తించాలి అని పండిత సుందరలాల్ హెచ్చరించారు.

శ్రీయుగులు మహేశ్వరీ ప్రసాద్ నారాయణసింగ్, సర్దార్ గురుబక్ష్ సింగ్ ప్రొఫెసర్ మోహన్‌సింగ్, రమేశచంద్ర మున్నగు ప్రముఖులు ఈ సమావేశానికి హాజరయారు.

డాక్టర్ కిచ్లూ, ముల్కరాజ్ ఆనంద్‌లకు శాంతిపతాకాలు వచ్చినందుకు వారిని అభినందిస్తూ తీర్మానించారు. అస్వస్థులుగా వున్న డాక్టర్ కుమారప్ప త్వరగా కోలుకోవాలని ప్రార్థనలు జరిపారు.

పరిసరరాష్ట్రాల్లో ఆంధ్ర సరిహద్దుల నిర్ణయానికి కమిషన్ నియామకం

ఒక ఓటు మెజారిటీతో అసెంబ్లీలో సవరణ ఆమోదం

అనుకూలంగా మొత్తం కమ్యూనిస్టుల, ఆంధ్రసభ్యుల వోటు

["విశాలాంధ్ర" విలేఖరి]

మద్రాసు, జులై 18

మద్రాసు, ఆంధ్ర, మైసూరు, ఒరిస్సా, హైద్రాబాద్, మధ్య ప్రదేశ్ రాష్ట్రాల సరిహద్దులను ఆయా రాష్ట్రాల మధ్య ఒడంబడికద్వారాగాని, సరిహద్దు సంఘాలద్వారా అంతిమంగా పరిష్కరించాలని, కాంగ్రెసు శాసనసభ పార్టీ కార్యదర్శి శ్రీ టి. యస్. వెంకటసుబ్బారెడ్డి ప్రతిపాదించిన సవరణ నేడు ఒక వోటు మెజారిటీతో అసెంబ్లీలో నెగ్గింది.

ఈ సవరణను ఆంధ్ర కమ్యూనిస్టు పార్టీ నాయకులు శ్రీ మోటూరి హనుమంతరావుగారు బలపరిచారు. సవరణకు అనుకూలంగా 122 వోట్లు, ప్రతికూలంగా 121 వోట్లు వచ్చాయి. నలుగురు సభ్యులు తటస్థులుగా వున్నారు.

ఆంధ్ర, తమిళనాడు, మలబార్ ప్రాంతాలకుచెందిన కమ్యూనిస్టు సభ్యులందరూ ఈ సవరణకు అనుకూలంగా వోటుచేశారు. ఆంధ్రశాసన సభ్యులంతా ప్రపథమంగా పార్టీ విభేదాలు విడనాడి ఏకగ్రీవంగా సవరణకు అనుకూలంగా వోటుచేశారు. కె. వినాయకం లాంటివారు సవరణకు వ్యతిరేకంగా ఆంధ్రేతరులందరినీ కూడగట్టడానికి చేసిన ప్రయత్నం విఫలమైంది.

మలబారు ప్రజాసోషలిస్టులు సవరణమీద తాటస్థ్యం వహించారు.

తమిళనాడు కాంగ్రెసు సభ్యులు, బల్లారి సమస్యను తరగ తోడగానికే వీలు లేదంటున్న కర్నాటక సభ్యులు, తమిళనాడు టాయిలర్సు పార్టీ, తమిళనాడు ప్రజాపార్టీ యితర స్వతంత్రులు సవరణకు వ్యతిరేకంగా ఓటుచేశారు.

ప్రభుత్వ సవరణ ఉపసంహరణ

ఒక్క ఆంధ్రరాష్ట్ర సరిహద్దులపై వచ్చే సమస్యలను మాత్రమే సరిహద్దు సంఘం విచారించాలనే ప్రభుత్వ సవరణ ఉదయమే ఉపసంహరించుకోబడింది. దానిని అందరూ తీవ్రంగా వ్యతిరేకించడం వల్లనే ముఖ్యమంత్రి ఉపసంహరించుకోవలసి వచ్చింది.

ప్రభుత్వ సవరణ మీద వ్యాఖ్యానిస్తూ బళ్ళారి తాలూకాలోని, మైసూరు రాష్ట్రంలోని సరిహద్దు తగాదాలను సరిహద్దుసంఘం పరిశీలించవలసరంలేదని ముఖ్యమంత్రి రాజగోపాలాచారిగారన్నారు. ఆంధ్ర అవశిష్ట రాష్ట్రాలమధ్య సరిహద్దు తగాదాలను, ఆంధ్ర మైసూరు రాష్ట్రాల మధ్య తగాదాలన్నింటినీ సరిహద్దు సంఘాలు విచారించాలనడం దేశం భాషా ప్రయుక్త రాష్ట్రాలుగా విభజించ బడుతుందనే దురభిప్రాయంతో చేయబడ్డ సవరణలాగ వుందని, అటువంటి అభిప్రాయం, కేంద్రానికి లేదంటూ రాజగోపాలాచారిగారు వ్యాఖ్యానించారు.

కాని శాసనసభ రాజగోపాలాచారిగారి వాదనను త్రోసిపుచ్చింది.

అక్టోబరు 1 తర్వాత నెలలోగా ఆంధ్ర, మైసూర్, ఆంధ్ర అవశిష్ట రాష్ట్రాల మధ్య సరిహద్దులను సవరించడానికి సరిహద్దు సంఘాలను నియమించాలని పిల్లలమర్రి వెంకటేశ్వర్లుగారు ప్రవేశపెట్టిన సవరణ వీగిపోయింది.

బళ్ళారి, మోళ, మొదలగు డిస్ట్రిక్టులలో జనవాక్య నిర్ధారణ తీసుకోవాలని నాగిరెడ్డిగారు ప్రతిపాదించిన సవరణకూడా ఓటుకు పెట్టగా వీగిపోయింది.

చిత్తూరుజిల్లాలో సరిహద్దులు

చిత్తూరుజిల్లా నిర్వివాద ప్రాంతంగా ప్రకటించబడిందని, కాని అక్కడ తమిళులు తగాదాలు లేవదీశారని, అందుచేత సరిహద్దు సంఘం వేసి, తమిళుల వాదనలను విచారించి నిర్ణయాలు డిసెంబరు 31 లోగా అమలు పరచాలని వినాయకం ప్రతిపాదించిన సవరణలో వుంది. ఇందులో "చిత్తూరుజిల్లా నిర్వివాద ప్రాంతమని ప్రకటించడంవల్ల" అన్న భాగాన్ని తొలగించాలని వినాయకం కోరారు. సి. వి. కె. రావు, నాగిరెడ్డి, విశ్వనాథంగారలు అలా తొలగించడం అసలు సవరణ సారాంశాన్ని మారుస్తుంది కనుక దానిని అంగీకరించడానికి వీలులేదన్నారు. కాని స్పీకర్ అభ్యంతరాన్ని త్రోసిపుచ్చారు. వినాయకం సవరణ కొత్తమూలంలో నెగ్గింది. ఇతర సవరణలు ఉపసంహరించుకోబడ్డాయి.

కొత్తగా ఎన్నికలు జరిపి, అప్పుడు ఎన్నుకోబడ్డ ఆంధ్ర శాసన సభ్యులతో ఆంధ్ర శాసనసభ యేర్పడాలని అర్థం వచ్చే వావిలాల గోపాలకృష్ణయ్యగారి సవరణలన్నీ ఓటుకు పెట్టగా ఓడిపోయాయి.

నాల్గవ క్లాజుపై వచ్చిన సవరణలపై వోటింగు సందర్భంలో స్పీకరుతో ప్రభుత్వ కార్యదర్శి యస్. వెంకటేశ్వరన్‌గారు మాట్లాడుతున్నారు. అప్పుడు వావిలాల గోపాలకృష్ణయ్యగారు సభా కార్యక్రమంలో ప్రభుత్వ కార్యదర్శి జోక్యం కలిగించుకోవచ్చునా ? అని అడగ్గా ఇలా ప్రశ్నించడం స్పీకర్ ప్రభుత్వ కార్యదర్శి సలహాల ప్రకారం నడుచుకుంటున్నాడని చెప్పడం అనీ, అలాచెప్పడం సభాధ్యక్షుని అవమానించడం అనీ కనుక గోపాలకృష్ణయ్యగారు తమమాటలను వుపసంహరించుకోవాలని కోరారు. వావిలాల తాము అన్నమాటలను ఉపసంహరించుకున్నారు. తరువాత సభ తిరిగి వోటింగు కార్యక్రమంలో పడింది. 18 వ క్లాజు వరకు చర్చ ముగిసింది. సవరణలపై ఓటింగు ముగిసింది.

తరువాత సభ సోమవారం ఉదయం 8-30 లకు వాయిదా పడింది. సభ సోమవారం నుండి ఉదయం 8-30 గంటల నుండి మధ్యాహ్నం 1-30 గంట వరకు జరుగుతుంది.

సాయంత్రం శాసనసభ వుండదు. సాయంకాలం కౌన్సిల్ వుంటుంది.

బళ్ళారి సత్యాగ్రహి పరిస్థితి

బళ్ళారి, జులై 16

బళ్ళారిలో ఆమరణ నిరాహార దీక్ష పూనిన సత్యాగ్రహి శ్రీ జేతిలి కామిరెడ్డిగారి పరిస్థితి ఆందోళన కరంగావుంది; ఆయన ఇప్పటికి 33 పౌనులు బరువు తగ్గిపోయారు; 27 రోజులక్రితం ఆయన వ్రతధారణ చేశారు.

బళ్ళారి తాలూకాలో వెంటనే 'ప్లెబిసైటు' జరిగేట్లు ఆంధ్ర శాసన సభ్యులు పట్టుపడి జేవాలని, శ్రీ జేతిలి కామిరెడ్డిగారి ప్రాణాలను రక్షించుకోవాలని పి. వి. యస్. కృష్ణమూర్తి; యస్. ఎ. కరీంసాహెబ్, యస్. మద్దులేటిగార్లు విడివిడిగా ప్రకటనలు చేశారు.

వ్యాఖ్యలు-విమర్శలు

కలకత్తాలో బ్రిటిషు ట్రాంకోకం పని యజమానులు రాష్ట్ర ప్రభుత్వపు అనుమతితో రెండవ తరగతి ప్రయాణీకుల ఛార్జీలను హెచ్చిస్తూ జారీచేసిన ఉత్తర్వులను ఉపసంహరించుకోమనీ, తగాదాను ఒక ట్రిబ్యునల్ విచారణకు పెట్టవలసిందనీ రాష్ట్ర ప్రభుత్వం "సలహా" యిచ్చింది.

లక్షలాది కలకత్తా ప్రజలు ఈ సమస్యపై పోరాడుతున్న బ్రహ్మాండమైన పోరాటం భారత ప్రజలందరి దృష్టినీ ఆకర్షించింది. ప్రభుత్వం 4000 మందిని అరెస్టుచేసి, లాఠీఛార్జీలు, బాష్పవాయు ప్రయోగాలు, తుపాకి కాల్పులద్వారా ఈ ఉద్యమాన్ని అణచడానికి చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. కాంగ్రెసు ప్రభుత్వం ప్రజల శక్తినిగుర్తించ వలసి వచ్చింది.

బ్రిటిష్ గుత్త పెట్టుబడిదారుల నిరంకుశ చర్యలను ప్రతిఘటించడంలో కలకత్తా పౌరులు ప్రదర్శించిన పోరాటశక్తి భారత ప్రజల్ని ఉత్తేజ పరుస్తుంది.

అయితే, కాంగ్రెసు ప్రభుత్వం అరెస్టయిన వారిని విడుదల చేస్తామని గాని, కాల్పులకు కారకులైన ఉద్యోగుల్ని విచారిస్తామని గాని, 144 వ సెక్షను ఉపసంహరించుకుంటామని గాని చెప్పలేదు. ఈ కోర్కెలనుకూడా కలకత్తా ప్రజలు తమ సంఘటితశక్తితో సాధించుకు తీరుతారనడంలో ఎట్టి సందేహం లేదు.

♦ ♦ ♦

సింగరేణి బొగ్గుగని కార్మికుల సమ్మె ప్రారంభమై 26 రోజులయింది. కార్మికులు ప్రశాంతంగానే సమ్మెజరుపుతున్నట్లు ప్రభుత్వానికి కాగులు ప్రకటనలు చేస్తున్నప్పటికీ, కాంగ్రెసు ప్రభుత్వం హంతకుగా 144 వ సెక్షన్ ప్రయోగించింది. దాన్ని ఆధారంగా చేస

తెలంగాణా ఉరిశిక్షలు రద్దుచేయాలి

ఆంధ్ర జిల్లాలలోని ప్రజల అభ్యర్థన

సత్తెనపల్లి, జులై 16

తెలంగాణా ఉరిశిక్షలను రద్దుచేయాలని, అనేకమందిపై బనాయించుతున్న దొంగ కేసులను ఎత్తివేయాలని కోరుతూ సత్తెనపల్లి తాలూకా రైతుసంఘాధ్యక్షులు, మద్రాసు శాసన సభ్యులు శ్రీ దర్శి లక్ష్మయ్య గారు ఒక ప్రకటన చేశారు.

ప్రకటనలో వారిలా తెలిపారు.

"తెలంగాణా రైతుకార్యకర్తలు సాయుధ పోరాటం విరమించి లహిరంగపద్ధతుల్లో తమ కోర్కెల సాధనకు ముందుకు వచ్చి తమ వద్ద నున్న ఆయుధాలను ప్రభుత్వానికప్పజెప్పారు. అయినప్పటికి హైదరాబాద్ ప్రభుత్వం తన పూర్వపద్ధతినే కొనసాగిస్తూ అజ్ఞాత వాసంనుండి బయటకు వచ్చిన అనేకమంది రైతుకూలీ నాయకులను కార్యకర్తలను అరెస్టుచేసి అనేక ఖూనీ కేసులు, దోపిడీ కేసులు బనాయించుతున్నారు. తెలంగాణా పోరాట విరమణ తర్వాత ఆదిరెడ్డి, సీతారామరెడ్డి, వెంకటనరసు మొదలయిన 8 మందికి పురిశిక్షలు ఇంకా అనేకమందికి దీర్ఘకాల శిక్షలు విధించబడినవి. ప్రజాన్యాయ్యవాదులందరు ఈ అమానుష నిర్బంధ కాండను తప్పక ఖండిస్తారు. కావున తెలంగాణా ఉరిశిక్షలు రద్దుచేయాలి. రాజకీయ ఖైదీలందరిని విడుదల చేయాలి అని హెచ్చరించుతున్నాను."

సంతకల్లులో

గుంతకల్లులో 15 వ తేదీన జరిగిన బహిరంగసభలో తెలంగాణా ఉరిశిక్షలు రద్దుచేయాలని, ఆంధ్రలోని రాజకీయ ఖైదీలను విడుదలచేయాలని కోరుతూ తీర్మానాలు చేయబడినవి. మున్సిపల్ కౌన్సిలర్లు శ్రీ టి. పక్కీరప్ప, శ్రీ యం. గోవిందులు, శ్రీ కె. ఆర్. వీరన్న గార్లు మాట్లాడారు.

ఇతరచోట్ల

శ్రీకాకుళం జిల్లా చీపురుపల్లి తాలూకా పేలాకర కమ్యూనిస్టు కమిటీ తెలంగాణా ఉరిశిక్షలు రద్దుచేయాలని ఆంధ్ర జిల్లాలోని రాజకీయ ఖైదీలను విడుదలచేయాలని కోరింది.

బందరు తాలూకా చిన్నాపురంలో రైతుసంఘ కార్యకర్తలు 12 వ తేదీన సమావేశమై తెలంగాణాలో ప్రభుత్వం విధించినఉరిశిక్షలు వెంటనే రద్దుచేయాలని రాజకీయ ఖైదీలందరినీ విడుదలచేయాలని, కోరుతూ తీర్మానించారు.

నెల్లూరుజిల్లా దర్శితాలూకాపడమర గంగవరం యువజనసంఘం 12వ తేదీన జరిపిన బహిరంగసభలో తెలంగాణా ప్రజానాయకులపైవిధించిన ఉరిశిక్షలను రద్దుచేయాలని కోరారు.

బొబ్బిలి తాలూకా నారాయణపురం గ్రామంలో 11 వ తేదీన జరిగిన బహిరంగ సభలో తెలంగాణా ఉరిశిక్షలు రద్దు చేయాలని కోరుతూ తీర్మానించారు.

పశ్చిమ గోదావరిజిల్లా నర్సాపురంలో మిల్లారివారి వ్యవసాయ కూలీపేటలో తెలంగాణలోని శిక్షలన్నీ రద్దు చేయాలని, రాజకీయ ఖైదీ లందరిని విడుదల చేయాలని కోరుతూ తీర్మానించారు.

విజయవాడ ప్రెస్‌కార్మికుల డిమాండు

విజయవాడ ప్రెస్‌వర్కర్సు యూనియన్ వర్కింగ్ కమిటీ శ్రీ పంచకర్ల కనకయ్యగారి అధ్యక్షతను సమావేశమై తెలంగాణా ప్రజాసేవకులపై ఇటీవల విధించబడిన మరణశిక్షలను నిరసించుతూ, ఈ శిక్షలను వెంటనే రద్దు చేయాలని కోరారు.

నామినేషన్లలోనే విజయభాగ్యం

హైద్రాబాద్ మునిసిపల్ ఎన్నికలలో కాంగ్రెసు ఎత్తు

బౌరంగాబాద్, జులై 16

నిజంగా వోట్లు పోలింగు వరకూ వచ్చిన వోట్లన్నీ ప్రజాసంస్థల ప్రతినిధులు హైద్రాబాద్ మునిసిపల్ ఎన్నికలలో నెగ్గుతున్నారు. కనక కాంగ్రెసు ఇప్పుడు నామినేషన్లలోనే విజయభాగ్యం సంపాదించుటకు ఎత్తు వేసింది.

గంగపురి (బౌరంగాబాదు) మునిసిపాలిటీకల స్థానాలు అయిదింటిని కాంగ్రెసు పోటీలేకుండానే గెలుచుకుంది. ప్రత్యర్థుల నామినేషను ప్రతా లన్నీ స్క్రూటినీలో త్రోసివేయబడ్డాయి.

వైధాన్ నగర ఎన్నికలలో ఆరు స్థానాలు కాంగ్రెసుకు వచ్చాయి.

ఉస్మానాబాద్ జిల్లాలో పరెండా పట్టణకౌన్సిలుకు కల 16 స్థానాలనూ కాంగ్రెసు పోటీలేకుండా గెలుచుకొంది. ప్రతిక్షేపుల నామినేషను పత్రాలన్నీ త్రోసివేయబడ్డాయి.

తుల్జాపూరు కౌన్సిల్ స్థానాలకు కాంగ్రెసులో పెజంట్స్ అండ్ వర్కర్స్‌పార్టీ సరాసరి తలపడి పోటీ చేస్తూంది.

తుమ్మకోడు భూములు పేదలకు సాగుకు యివ్వాలి

జిల్లా కలెక్టరుకు రైతుసంఘ మెమొరాండం

మాచర్ల, జులై 17

జూలై 14 వ తేదీన పల్నాడు తాలూకా తుమ్మకోడు ఫారెస్టు బంజరును చూచుటకు గుంటూరు జిల్లా కలెక్టరుగారు మాచర్ల నుకాంకు వచ్చిన సందర్భంలో పల్నాటి తాలూకా రైతు సంఘ కార్యదర్శి శ్రీ యం. నాగిరెడ్డి గారు మెమొరాండంను సమర్పించారు.

తుమ్మకోడు ఫారెస్టులోని సాగుకు లాయకైన షుమారు 6 వందల యకరముల భూమిని ఫారెస్టునుండి విడగొట్టి పేదలకు సాగుకు యివ్వాలనీ, ఆ బంజరులోనికి ప్రవేశసందర్భంలో అనవసరంగా అరెస్టు చేయబడిరిమాండు నందుంచబడిన రైతుసంఘ కార్యకర్తలను రేగురిని వెంటనే బేషరతుగా విడుదల చేయాలనికోరారు.

అయితే సమాధానంగా ప్రభుత్వం నుండి వచ్చిన రాజీ నిర్ణయాలు ముందు అమలు పర్చుమనీ, ఎవరుకూడా భూములలో ప్రవేశించకుండా వుండేట్లయితే ఆ బంజరు భూములు సాగుకు ఇచ్చేలా ప్రభుత్వానికి సిఫారసు చేస్తామనీ, కలెక్టరుగారు అన్నారు. అరెస్టు చేయబడిన వారి విషయమై ప్రస్తుతం జామీనుమీద విడుదల చేయబడతారని కూడా చెప్పారు.

తుమ్మకోడు ఫారెస్టు భూములలో అరెస్టు

చేయబడినవారి విడుదల

మాచర్ల, జులై 17

గుంటూరుజిల్లా పల్నాడుతాలూకా తుమ్మకోడు ఫారెస్టుబంజరును పేదలు సేద్యంచేసుకునే సందర్భంలో ఈ నెల 7 వ తేదీన అరెస్టుచేయబడి మాచర్ల సబ్‌జైలులో రిమాండునందుంచబడిన కమ్యూనిస్టుపార్టీ ఆర్గనైజరు శ్రీ యం. అప్పిరెడ్డి, రైతుసంఘ కార్యకర్త శ్రీ పోలు చలమయ్య, ఫారెస్టు బంజరు కమిటీ అధ్యక్ష కార్యదర్శులు శ్రీయుతులు సత్యాలశౌరి, కుక్కడాల వరసింహారావు, అలవాల రాములుగార్లు ఈనెల 15 వ తేదీన జామీనుమీద విడిలిచేయబడ్డారు.

ఈ సందర్భంలో తుమ్మకోడుకు చుట్టు ప్రక్కలనున్న 6 7, గ్రామాల వ్యవసాయ కూలీలు బంజరు భూములలోనికి ప్రవేశించకుండా 144వ సెక్షను జారీచేసినట్లు, తుమ్మకోడులో సాయుధ పోలీసులను వుంచినట్లు తెలుస్తోంది. అన్నిగ్రామాల్లో 144వ సెక్షన్ సంగతి దండోరామూలంగా ప్రచురించారని కూడా తెలుస్తోంది. (వి. వి.)

యుద్ధ విరమణ తర్వాత కొరియా ఐక్యత 6 నెలల్లో సాధించాలి

లేదా యుద్ధం తప్పదట

కాన్‌ఫ్రాన్సిస్కో, జులై 18

అమెరికాలోని దక్షిణ కొరియా రాయబారి డాక్టర్ బ్యాన్‌యాంగ్, యుద్ధవిరమణ తర్వాతక 6 నెలల్లో కొరియాను ఐక్యపరచకపోతే, దక్షిణ కొరియా తిరిగి యుద్ధం చేస్తుందని బెదరించాడు.

భద్రాచలం తాలూకా గ్రామాల్లో వ్యవసాయ కూలీల సమ్మె

కూలిరేటు పెంచాలని డిమాండు

భద్రాచలం, జులై 17

భద్రాచలంతాలూకా గ్రామాలగు ఎటపాక, చెన్నంపేట, శీతంపేట, గుండాల, రాయనపేట, గోళ్లగట్టు మొదలయిన సుమారు 25 గ్రామాల్లో వ్యవసాయకూలీలు గత నాల్గురోజుల నుండి కూలీరేట్లు పెంచాలని కోరుతూ సమ్మెసాగిస్తున్నారు. మనిషి ఒకటికి కూలీరు 1-2-0 చొప్పున యివ్వాలనీ కొన్నలు- అయితే 3 శేర్లు, వడ్లయితే 4 శేర్లు యివ్వాలని డిమాండు చేసారు. స్థానిక భూస్వాములు అటు రైతాంగాన్ని ఇటు కూలీలను అనేకవిధాల బెదరిస్తూ సమ్మె చెడగొట్టడానికి ప్రయత్నిస్తున్నారు. కాని వ్యవసాయకూలీలు మాత్రం పట్టుదలతో సమ్మెసాగిస్తున్నారు. తమ న్యాయమైన కోర్కెలను అంగీకరించవలసిందిగా రైతాంగంతో రాయబారాలు జరుపుకున్నారు. (వి. వి.)

సుగమంచిపల్లె రాతిగనులు మూత

700 మందికి నిరుద్యోగం

జమ్మలమడుగు, జులై 15

జమ్మలమడుగు తాలూకా సుగమంచిపల్లె రాతిగనులు, తిరిగి ఉత్తర్వు యిచ్చేతదాకా పనిచేయకూడదని గత నెలలో డిప్యూటీ కలెక్టరు ఆర్డరు జారీచేశారు. ఆ విధంగా ఆర్డరు చేయడానికి కారణ మేమిటోకూడా తెలియడంలేదు. దీని ఫలితంగా గని కార్మికులు బాడుగలు తోలుకొని జీవించే వారుమొత్తం ఏడువందల మంది నిరుద్యోగానికి గురైనారు. గని కార్మికులు తమ కష్టపరిస్థితులను వివరిస్తూ, గనుల్లో పని జరుపుకోడానికి అవకాశం కల్పించవలసిందిగా ప్రభుత్వాన్ని కోరినప్పటికీ ఇంతవరకు ఏవిధమైనచర్య తీసుకోలేదు.

ఈగనులపై దాదాపు 8 గ్రామాలకు చెందిన ప్రజలు ఆధారపడి ఉన్నారు. 50 సంవత్సరాల నుండి గనులలో వారికి పని దొరుకుతుండేది.

కరువు తీవ్రతవల్ల చదువులకు స్వస్తి!

అనంతపురం జిల్లా విద్యార్థుల కడగండ్లు

అనంతపురం, జులై 14

అనంతపురంజిల్లా విద్యార్థి ఫెడరేషన్ కార్యదర్శి కె. ఈశ్వరయ్యగారు ఈ క్రింది ప్రకటన చేశారు.

కరువు తీవ్రతచేత అనంతపురం విద్యార్థులు తమ చదువుకు స్వస్తిచెప్పి పొట్టకు పట్టెడన్నము దొరకక అనేక కడగండ్లు పడుతూ పలుప్రాంతాలకు తరలిపోతున్నారు. కదిరి, పెనుగొండ తాలూకాలలో, విద్యార్థులు 5, 6 మైళ్ళదూరానవున్న గ్రామాలకుపోయి, గంజి త్రాగి హైస్కూళ్ళకు పోతున్నారు. కొంతమంది అసలు చదువుకే స్వస్తిచెప్పి భిక్షాపాత్ర చేతబట్టి వెళ్లిపోతున్నారు. తాడిపత్రి తాలూకాలోకూడా పరిస్థితి యిలాగే వున్నది.

ఇప్పటికీ జిల్లాలో వర్షముపడలేదు. అప్పులు పుట్టడములేదు. ఈ పరిస్థితులలో కాలేజి విద్యార్థుల పరిస్థితి మరింత దారుణంగా ఉన్నది. అనేకమంది కాలేజీలో జీతాలు చెల్లించలేదు.

గతసంవత్సరం కాలేజీలో చేరడానికి దాదాపు 18 వందల దరఖాస్తులువస్తే, ఈసంవత్సరం 9 వందలు మాత్రమే వచ్చినవి; అందులో సీట్లు దొరికినవారు కూడ కొందరు డబ్బులేక వారి ఇంటియందే ఉండిపోతున్నారు.

పోయిన సంవత్సరం గరల్స్‌హాస్టలులో 25 మంది వుండగా, ఈసంవత్సరం 5 మందికంటె ఎక్కువరాలేదు. అయిదు మందితో హాస్టలు నడపడం కష్టమని మూసివేస్తున్నారు. కొన్ని ఏండ్ల నుంచి ఈహాస్టలు బాగా జరుగుతూ వచ్చింది. కాని ఈసంవత్సరం మూస్తున్నారంటే పరిస్థితి యెంతదారుణంగా వుందో చెప్ప పనిలేదు. ప్రభుత్వము విద్యార్థులకు తగిన రక్షణ యిచ్చి రిలీఫ్ హాస్టలు పెట్టాలని కోరుతున్నాను.

తోటి జిల్లాలవారు అనంతపురం జిల్లాలో కరువుచే కృంగిపోయే విద్యార్థుల సహాయార్థం ధనం, పుస్తకాలు, బట్టల రూపేణా సహకరించాలని కోరుతున్నాను.

చదవండి

పంచవర్ష ప్రణాళిక :

రచన :

శ్రీ పుచ్చలపల్లి సుందరయ్య,

వెల : 0-6-0 మాత్రమే

పొగాకు మార్కెటింగ్ కమిటీ ఎన్నికలు

ఒంగోలు, బాపట్ల తాలూకా రైతుసంఘాల సన్నాహాలు

ఒంగోలు, జులై 16

గుంటూరుజిల్లా ఒంగోలు, బాపట్ల తాలూకా రైతుసంఘాల సంయుక్త సమావేశం ఉప్పుగుండూరులో జరిగింది.

రైతు సమస్యలపై సమగ్రంగా చర్చించి యీ దిగువ తీర్మానాలు చేసారు.

పొగాకు రైతుల సౌకర్యాలను గురించి లోగడ జిల్లా రైతుసంఘం మార్కెటింగు కమిటీలో తమ ప్రతినిధుల ద్వారా కృషిచేసింది. కాని తరువాత సంవత్సరాలలో రైతుసంఘ ప్రతినిధులు మార్కెటింగు కమిటీలోలేనందున పొగాకు కంపెనీ యజమానుల ప్రాబల్యం హెచ్చి రైతుల యిబ్బందులను గురించి యోచించినవారు లేరు. కనుక రైతుల శ్రేయస్సుకొరకు రైతుసంఘం మార్కెటింగు కమిటీకి జరిగే ఎన్నికలలో తమ అభ్యర్థులను నిలబెట్టి పోటీ చేయాలని నిర్ణయించారు.

గత సంవత్సరం పొగాకువ్యాపారం సరిగా సాగనందున లక్షలకొలది విలువగల పొగాకు రైతులదగ్గర నిల్వవుండిపోయింది. తత్ఫలితంగా రైతాంగం డబ్బులేక నానా అవస్థలు పడుతుంది. ప్రభుత్వం పొగాకు నిల్వయున్న రైతులకు అప్పులివ్వాలనీ, రైతులకు కూలీలను కూడా నష్టంకలుగజేసేమార్కెట్ యార్డును తాత్కాలికంగా ఆపుచేయాలనీ, చైనావాళ్ళమొదలగుప్రజాస్వామిక దేశాలతో వ్యాపార సంబంధాలుపెట్టుకోవాలని, ఆంధ్రరాష్ట్రావతరణ సందర్భములో రాజకీయఖైదీలనువిడుదలచెయ్యాలనీ, తెలంగాణా రైతు నాయకులపై ఉరిశిక్షలు రద్దు చెయ్యాలని కోరుతూ మరికొన్ని తీర్మానాలుచేశారు.

పంచాయితీ అధ్యక్షులు శ్రీ గోగినేని న్యాపా భక్తరాజుగారి అధ్యక్షతను సాయంకాలం బహిరంగసభ జరిగింది. చేములపల్లి శ్రీకృష్ణగారు, పార్లమెంటు సభ్యులు శ్రీ పి. వి రాఘవయ్యగారు ప్రస్తుత రాజకీయ పరిస్థితులను గురించి మార్కెటింగ్ కమిటీ ఎన్నికలను గురించి విపులంగా మాట్లాడారు.

గుడివాడలో ధాన్యం బస్తారు. 32 లు

చౌకడిపోలకొరకు కలెక్టరువద్దకు రాయబారం

గుడివాడ, జులై 17

కృష్ణాజిల్లా గుడివాడ, పరిసర గ్రామాలలో బస్తా ధాన్యం యీనాడు రు. 32-0-0 వరకు అమ్ముతున్నారు. శేరు బియ్యం 0-12-0 లకు దొరకడం దుర్లభమవుతూంది.

జులై 16 న గుడివాడ తాలూకా కమ్యూనిస్టుపార్టీ రైతు సంఘం, వ్యవసాయ కూలీ సంఘాల తరఫున శ్రీ పి. వి. సుబ్బారావు, శ్రీ వి. సీతారామయ్య, శ్రీ బి. వి. రావు తదితరులు జిల్లా కలెక్టరును కలుసుకొని ఒక మెమొరాండము సమర్పించారు.

ధాన్యం, బియ్యం ధరలు విపరీతంగా పెరిగినందున ఇప్పటికే పేదలు కొనలేక యాతన పడుతున్నారనీ, ఇక ముందు రాబోవు సాసాలు పనులులేక వ్యవసాయ కూలీలు, తదితర పేదప్రజానీకం కట-కటలాడ వలసివస్తుందనీ గనుక తాలూకా అంతటా చౌకడిపోలు యేర్పాటుచేసి సరసమైన ధరలకు బియ్యం సరఫరా చేయాలనీ మెమొరాండములో వివరించారు.

కలెక్టరు అన్ని సావధానంగావిని అవసరమైన ప్రాంతాలలో త్వరలోనే చౌకడిపోలు యేర్పాటు చేస్తామని తెలియజేసారు.

తాలూకా కమ్యూనిస్టు కమిటీ అభ్యర్థన

ఇటీవల గుడివాడలో సమావేశమైన తాలూకా కమ్యూనిస్టు కమిటీ రోజు రోజుకు పెరిగి పోతూన్న ధాన్యం ధరలను, అవి కొనలేక పేదలు పడుతున్న పాట్లను గమనించి ప్రభుత్వం వెంటనే గ్రామాలలో చౌకడిపోలు యేర్పాటుచేయాలని కోరుతూ తీర్మానించింది.

ఆంధ్రరాష్ట్ర అవతరణ సందర్భంలో జైళ్ళలో మ్రగ్గుతున్న రాజకీయ ఖైదీలందరిని ప్రభుత్వం విడుదల చేయాలని కోరుతూ మరికొన్ని తీర్మానాలు చేసారు.

రాయలసీమ ప్రాజెక్టులు

మద్యపాన నిషేధం రద్దుచేసి వచ్చే ఆదాయంతో కట్టాలి

గడ్డంవారిపల్లె, జులై 15

మద్యపాన నిషేధం రద్దుచేసి ఆ వచ్చిన ఆదాయంతో రాయలసీమప్రాజెక్టులు నిర్మించాలని కోరుతూ కమలాపురం తాలూకా కమ్యూనిస్టు కమిటీ అభ్యర్థించింది. తాలూకాలో గంగిరెడ్డిపల్లె, యర్రగుంట్ల ఫిర్కాలలో గంజి కేంద్రాలు ఏర్పాటు చేయాలని రాజమండ్రి జైలులోని రాజకీయ ఖైదీలను విడుదల చేయాలని కోరుతూ తీర్మానించారు.

ఆకలికి తాళలేక కన్నబిడ్డల అమ్మకం!

పీలేరు, జులై 15

చిత్తూరుజిల్లా, వాయిల్పాడు తాలూకా మందూరు గ్రామానికి చెందిన షేక్ సయ్యద్ సాహెబ్ (30 సం॥) సంవత్సరం వయస్సుగల తనబిడ్డ (పేరు సాయప్పీరు)ను అనంతపురంలో రు 20 లు నగదు ఒక జత బట్టలకు అమ్మివేశాడు. అప్పటికీ తనకు చేయడానికి పని లేక, తినడానికి తిండిలేక, ఆ డబ్బుతో ఊరూరా తిరిగి పీలేరు చేరాడు. సయ్యదు బాషా అను పేరుగల తన పెద్ద కుమారుని (3 సం॥) పీలేరులో అమ్మజూపాడు. కొనేవారు కనపడకపోగా, షేక్ సయ్యద్ సాహెబ్ ఎక్కడికో వెళ్ళాడు. (వి. వి.)

బార్యాబిడ్డల ఆకలి తీర్చలేక ఆత్మహత్య!

యర్రగుంట్ల, జులై 15

కడప జిల్లా కమలాపురం తాలూకా కదిరివాండ్లపల్లిలో నొల్లమొర్రి బోయిన సుబ్బన్న (50 సం॥) అను నతడు, తన భార్యాబిడ్డలను పోషించలేక ఈ దినం రైలుక్రింద పడి చనిపోయాడు. ఈ కుటుంబం వారం రోజులనుండి పస్తులుంటున్నారు. (వి. వి.)

విజయవాడనే రాజధానిగ చేయాలి

ప. గో. జిల్లా యువజన సంఘం అభ్యర్థన

తాడేపల్లిగూడెం, జులై 16

ఆంధ్రదేశ పురోభివృద్ధికి అన్ని విధాల అనువుగావుండే విజయవాడనే రాజధానిగా చేయాలని కోరుతూ నేడిచట సమావేశమైన పశ్చిమ గోదావరిజిల్లా యువజనసంఘం అభ్యర్థించింది. మారుమూలనున్న కర్నూలులో రాజధాని నిర్ణయించినందుకు కాంగ్రెసులోక్, ప్రజా సోషలిస్టుపార్టీలను సమావేశం విమర్శించింది.

బళ్లారి సమస్యను ప్లెబిసైటు ద్వారా పరిష్కరించాలని, నూతన రాష్ట్రం ఏర్పడిన వెంటనే సరిహద్దు కమీషనును నియమించాలని, హైకోర్టును కూడా వెంటనే విడదీయాలని కూడా కోరుతూ తీర్మానాలు చేశారు.

ఆంధ్రరాష్ట్ర ఉద్యమంలో పెట్టిన కేసులు ఉపసంహరించాలనీ, కాల్పుల్లో మరణించిన వారికి పరిహారం యివ్వాలని కూడా కోరారు.

తొత్తరమూడి

తూర్పు గోదావరి జిల్లా తొత్తరమూడి గ్రామ యువజనసంఘంవారు విజయవాడలోనే రాజధాని స్థాపించాలని కోరుతూ 14 వ తేదీన సమావేశమై తీర్మానించారు. రాజకీయ ఖైదీలను విడుదలచేయాలని కోరారు. నూతన సంవత్సరానికి కార్యవర్గం ఎన్నుకొన్నారు.

ప్రజాప్రభుత్వహయాంలో పనులివ్వని అడగరాదట!

వేయిమంది చేనేత పారిశ్రామికులకు కడపజిల్లా కలెక్టరు 'సలహా'

జమ్మలమడుగు, జులై 15

"ప్రజలే ప్రభుత్వం, ప్రభుత్వమే ప్రజలుగదా! పనులు కల్పించమని ప్రభుత్వాన్ని అడిగితే ఎలా? ప్రజలే పనులు చూచుకోవాలి" అని నిరుద్యోగులైన వేయిమంది చేనేత పారిశ్రామికులకు కడప జిల్లా కలెక్టరు నిన్నటిదినం 'సలహా' యిచ్చారు.

కడప జిల్లా కలెక్టరు పి. సి. జేమ్సు గారు జమ్మలమడుగు మకాంలో వుండగా నిన్నటిదినం వేయిమంది చేనేత పారిశ్రామికులు ఆయనవద్దకు యాత్రవచ్చారు. వీరికి తాలూకా చేనేత పారిశ్రామికసంఘ అధ్యక్షులు శ్రీ బడిగించల వెంకటసుబ్బయ్య, కార్యదర్శి శ్రీ కంబం చంద్రాయుడు, జిల్లాసంఘ కార్యదర్శి శ్రీ టేకూరు సుబ్బారావు ప్రభృతులు నాయకత్వం వహించారు.

కూలి తగ్గించుకొని బట్టనేయడానికి సిద్ధపడినా, చేనేత వారికి పని కల్పించువారు లేరని, దినదినానికి వారి పరిస్థితి విషమిస్తున్నదని రాయబారవర్గసభ్యులు వివరించారు. మోరగుడిఅను గ్రామంలో భార్యాబిడ్డలవీడి, అగ్నిస్వీకరణకోసంలోపురి పోనికొని వచ్చిన సంఘటనను కలెక్టరు దృష్టికి తెచ్చారు. వెంటనే చేనేతవారికి సంకటిపత్రం తెరవాలని, రంగుచీరలు, అంచుధోవతులు చేనేతకు కేటాయించాలనికోరారు; జీవనభృతిరెండువందల రూపాయలకు తక్కువ గాకుండా ఇవ్వాలని, ప్రభుత్వాధికారులకు విధిగా చేనేతబట్ట కొనాలని సూచించారు.

విద్యార్థిఫెడరేషన్ తరఫున కేశవులురెడ్డి ప్రభృతులు ఒక నివేదిక సమర్పిస్తూ, చేనేతవారి బిడ్డలకు స్కూలు ఫీజు రద్దుచేయాలని, మధ్యాహ్నం ఉచిత భోజనవసతి కలుగజేయాలని కోరారు.

సుగమంచిపల్లె రాతిగనులు మూసివేయవలసిందిగా గత నెలలో డిప్యూటీ కలెక్టరు ఉత్తర్వువేసినందున సుమారు ఏడువందలమంది నిరుద్యోగానికి గురి అవుతున్నారని, వెంటనే అక్కడ పనులు ప్రారంభించేట్లు చేయాలని టేకూరు సుబ్బారావుగారు తెలియజేశారు.

జిల్లా కలెక్టరు రాయబారవర్గ సభ్యులతో ఇలా చెప్పారు :

"త్వరలో వానలు కురిస్తే పనులు దొరుకుతాయి. ప్రజలే ప్రభుత్వం ప్రభుత్వమే ప్రజలుగదా! పనులు కల్పించమని ప్రభుత్వాన్ని అడిగితే ఎలా? ప్రజలే చూచుకోవాలి. వారం పదిరోజులలో రోడ్లపనులు ప్రారంభిస్తాము. అక్కడ కంకరకొట్టే పనులుంటాయి" అన్నారు.

పాడుబడ్డ పూటకాలువలు మరమ్మతు చేయించవచ్చు అనే సూచనను ఆయన నిరాకరించారు. వానకొరకు దేవుని ప్రార్థించమని సెలవిచ్చారు. మానవులు ఏనాడైనా వానవలసిందేగదా! అని 'వేదాంతప్రబోధ' చేశారు. గంజి కేంద్రాలు పెట్టుటకు తమకు అధికారం లేదని పునరుద్ఘాటించారు.

తరువాత జరిగిన చేనేతవారి సమావేశంలో చంద్రయ్యలు రెడ్డి, చిన్నపరెడ్డిగార్లు ప్రసంగించారు. (వి. వి.)

రాయదుర్గం తాలూకా మానకన్ గ్రామంలో ఈ నెల 12 వ తేదీ రాత్రి పంచాయితీ సమావేశం జరిగింది. ముప్కుంది వీరభద్రప్పగారు సభకు అధ్యక్షత వహించారు. అనంతపురంజిల్లా కమ్యూనిస్టుపార్టీ కార్యదర్శి శ్రీ నీలం రాజశేఖరరెడ్డి కల్యాణదుర్గం తాలూకా రైతుసంఘ కార్యదర్శి బి. ఎర్రస్వామిగార్లు వివిధ సమస్యలపై ఉపన్యసించారు.

రేడియో

జూలై : 21 మంగళవారం

విజయవాడ (357.1 మీటర్లలో)

ఉదయము : 6-55 స్వాగతము; 7-0 (తె. వా); 7-15 మద్రాస్ వలె; 7-30 సుప్రభాతము వలె; 8-0 (ఆం. వా); మధ్యాహ్నం : 12-30 మాధ్యమిక పాఠశాల విద్యార్థులకు: 1-0 మద్రాస్ వలె, 1-30 మద్రాసు వలె; 1-40 (హిం. వా.); 1-50 (తె. వా.) 2-0 మద్రాసు వలె; 2-15 ఉన్నతపాఠశాల విద్యార్థులకు; 4-0 ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు; సాయంత్రం : 6-30 టి. కె. యశోదాదేవి; 5-50 కోటిపల్లి ప్రకాశరావు : వయొలిన్; 6-10 స్థానిక ప్రకటనలు, వాతావారణము; 6-15 సంగీత శిక్షణ; 6-30 గ్రామస్థుల కార్యక్రమము; 7-0 (తె. వా.); 7-15 గ్రామస్థుల కార్యక్రమము; 7-30 గీతమంజరి; 7-45 వాద్యబృందం; 8-0 టి. కె. యశోదాదేవి; 8-30 కోటిపల్లి ప్రకాశరావు : వయొలిన్; 9-0 (ఆం. వా); 9-15 కాలేజీలకు; 9-30 సమాప్తి.

మద్రాసు (బి) (270.3 మీటర్లలో)

ఉదయము : 6-55 స్వాగతము; 7-0 (తె. వా); 7-15 చెంబైవైద్యనాథ భాగవతర్; 7-30 గోపాలకృష్ణయ్యర్ మధ్యాహ్నం : 12-0 కార్మికుల కార్యక్రమము; 12-30 మాధ్యమిక పాఠశాల విద్యార్థులకు; 1-0 తేదియూర్ ఆర్. నారాయణస్వామి; 1-30 (ఆం. వా); 1-40 గీతమాలిక; 1-50 (తె. వా); 2-0 సారంగి; 2-15 ఉన్నతపాఠశాల విద్యార్థులకు; 4-0 ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు 4-30 పాశ్చాత్యసంగీతం; సాయంత్రం : 5-30 వయొలిన్; 6-15 సాయం సంగీతము; 6-30 గ్రామస్థుల కార్యక్రమము; 7-0 (తె. వా); 7-15 గ్రామస్థుల కార్యక్రమము; 7-30 వాగ్గేయకారులు; పట్నం సుబ్రహ్మణ్యయ్యర్ ప్రసంగము వోలేటి వెంకటేశ్వర్లు; 7-45 గోటువాద్యం; 9-15 నాటిక (తమిళం) 9-30 ఆర్. గురుమూర్తి; 10-0 వాద్య సంగీతం; 10-30 సమాప్తి.

హైద్రాబాద్ (411.0 మీటర్లలో)

ఉదయము : 6-55 ప్రభాతగీతి; 7-0 (తె. వా); 7-15 టి. ఎస్. చంద్రశేఖరన్; 8-0 (ఆం. వా); 8-15 (హిం. వా); 8-30 సోమప్రకాశ్; సాధీ; 8-45 ఖయాల్; 9-0 ఇక్బల్ అహ్మద్; మధ్యాహ్నం : 12-30 గీత్. ఘజల్; 12-50 (మ. వా); 1-0 కవాలి: 1-10 గీతవల్లి; 1-30 నాదస్వరం; 1-50 (తె. వా); సాయంత్రం : 5-30 మరాటీలో కార్యక్రమము; 6-0 ఇక్బల్ అహ్మద్, 6-10 స్థానిక ప్రకటనలు; 6-15 అప్‌కా పత్రిమిలా; 6-20 ఖయాల్; 6-35 సోమప్రకాశ్, సాధీ; 6-45 గ్రామసీమ 7-0 (తె. వా); 7-15 గ్రామసీమ; 7-45 (క. వా); 8-0 ఆంగ్లప్రసంగము; 8-15 టి. వి. విశ్వనాథన్; 8-30 లోక్ ప్రియగానే; 9-0 (ఆం. వా): 9-15 (ఉ. వా); 9-30 టి. వి. విశ్వనాథన్; 10-15 సమాప్తి.

మహాదేవపట్నం

పశ్చిమ గో॥జిల్లా మహాదేవపట్నంలో ఎన్నికలుజరుపకపోవడం అన్యాయమనీ, మహాదేవపట్నం గ్రామాన్ని పంచాయితీ లిస్టులో చేర్చి 5 నేల ప్రజలకు పంచాయితీ సౌకర్యాలు కలుగజేయాలని శ్రీ జి. శ్రీరామరాజు వ్రాస్తున్నారు.

అనంతపురం జిల్లా బోర్డుకు అప్పు

కలెక్టరు తిరిగి ఇవ్వటంపై అసెంబ్లీలో ప్రశ్నలు

మద్రాసు, జులై 16

కరువు ప్రాంతాల్లోని రైతులకు పంచమని 1953 మార్చిలో ప్రభుత్వం అనంతపురం జిల్లాబోర్డుకు యిచ్చిన 12½ లక్షల అప్పులో 9 లక్షల 55 వేల రూపాయల అప్పు, పంపింగు సెట్టుల క్రింద యిచ్చిన 50 వేలు జిల్లా కలెక్టరు ప్రభుత్వానికి తిరిగి యిచ్చివేసినమాట నిజమేగాని, అందుకు కారణం సిబ్బంది కొరతమాత్రం కాదని రెవిన్యూమంత్రి శ్రీ కె. వి. వేమారెడ్డిగారి ప్రశ్నకు జవాబుగా అసెంబ్లీలో చెప్పారు.

నాగిరెడ్డి : రైతులు తగినన్ని దరఖాస్తులు పెట్టుకోలేదని అప్పు తిరిగి యిచ్చివేశారా? లేక ఆ అప్పు రైతులకు పంచడంవల్ల ప్రయోజనం జరగదని భావించారా?

జవాబు : 51 లక్షలఅప్పు ఆజిల్లాలో రైతులకు పంచలడింది. 9½ లక్షలు మాత్రమే తిరిగి యివ్వబడ్డది.

పి. రామమూర్తి : 12 లక్షలు ప్రభుత్వం పంపిన వారం రోజులలోనే కలెక్టరు 9 లక్షలు తిరిగి ప్రభుత్వానికి అప్పజెప్పిన మాట వాస్తవమేనా?

జవాబు : 51 లక్షలు ఖర్చుపెట్టాక కలెక్టరు మిగిలింది పంపివేశాడు.

లక్ష్మీనారాయణరెడ్డి : దరఖాస్తులు పెట్టుకుని మంజూరు అయిన సందర్భాలలోకూడ రైతులకు అప్పులు యివ్వబడలేదన్న సంగతి ప్రభుత్వానికి తెలుసునా?

నాగిరెడ్డి : అనంతపురంలో కరువు ప్రబలంగా వుందని ప్రభుత్వం చెబుతున్న సమయంలోనే కలెక్టరు ప్రభుత్వం యిచ్చిన అప్పులలో 9½ లక్షలను వారంరోజులలోనే ప్రభుత్వానికి తిరిగి అప్పగించినమాట నిజము? కాదా?

జవాబు :- కరపత్రాలలాగా అప్పు ధనాన్ని ప్రభుత్వం పంచలేదు.

చల్లా సుబ్బారాయుడు : కలెక్టరు అప్పుధనాన్ని తిరిగి ప్రభుత్వానికి ఇచ్చివేసినప్పుడు స్థానిక ప్రజలు నిరసన తెలియజేసినమాట వాస్తవమేనా?

జవాబు : ప్రశ్న అర్థం కాలేదు.

అమెరికన్ శాస్త్రజ్ఞునిచే కొత్తగా కనిపెట్టబడినది

ట్రామ్ చార్జీల పెంపుదల సమస్యను ట్రిబ్యూనల్ తీర్పుకు వదలడానికి బెంగాల్ ప్రభుత్వ నిర్ణయం

తీర్పు వచ్చేవరకూ పెంచిన రేట్లు అమలు జరపవద్దని కంపెనీకి సూచన

కలకత్తా, జులై 18

ట్రామ్ చార్జీల పెంపుదల సమస్యను ఒక ట్రిబ్యునల్ తీర్పుకు వదలివేయ వలసిందిగా ఈవేళ పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం కలకత్తా ట్రాం వే కంపెనీకి సలహా యిచ్చింది. ట్రిబ్యునల్ తీర్పు వచ్చేవరకూ ప్రస్తుతం పెంచిన రేట్లను అమలు జరుప వద్దనికూడా కంపెనీకి ప్రభుత్వం సూచించింది.

ఈ సందర్భములో రాష్ట్రప్రభుత్వం ఒక ప్రకటనలోస్తూ తమ ఈ నిర్ణయం నగరంలో కల్లోల పరిస్థితులను చక్కజెట్టి వెనువెంటనే మామూలు శాంతియుత పరిస్థితులు నెలకొనడానికి దారితీయగలదనే ఆశాభావాన్ని వెలిబుచ్చారు.

ట్రామ్‌చార్జీల పెంపుదలకు వ్యతిరేకంగా ఉద్యమాన్ని సాగించుతున్న వామపక్షాల నాయకులు ప్రభుత్వం నిర్ణయంపై ఈ క్రింది ప్రకటన చేశారు :

చాల ఆలస్యంగానైనా ప్రభుత్వం ప్రజాభిప్రాయ తీవ్రతను గుర్తించి, తన విధానాన్ని మార్చుకొంటున్నట్లు కనబడుతోంది. ప్రభుత్వ ప్రకటన సంతృప్తికరంగాలేదు. ఎందువల్లనంటే ప్రజల ముఖ్యమైనకోర్కెలు అందులో అంగీకరించబడలేదు. అంతేకాదు ప్రతిఘటనా ఉద్యమ సందర్భంలో అరెస్టు చేయబడిన వారిని ఎలాంటి మరతులు లేకుండా విడుదల చేయాలన్న సమస్యపై ప్రభుత్వం మౌనం వహించింది. 144 వ సెక్షన్ తదితర నిర్బంధ పద్ధతులను ఉపసంహరించుకొనే భావం కాని, గత కొద్దిరోజుల్లో జరిగిన పోలీసు అత్యాచారాల విషయమై విచారణ జరిపించే ఉద్దేశ్యం కాని ప్రభుత్వానికి ఉన్నట్లు కనపడదు.

కలకత్తా మేయర్ ప్రయత్నం

ప్రతిఘటనా కమిటీ రేపు సమావేశమై పరిస్థితినంతటినీ చర్చించుతుంది.

ప్రభుత్వ మూతన ప్రతిపాదనలు ప్రకటించబడిన ఆరు గంటల అనంతరం పత్రికా విలేఖరులు ప్రతిఘటనా కమిటీ సెక్రటేరియట్‌ను కలవనుకొని అభిప్రాయాన్ని కోరగా ఇంతవరకూ ప్రభుత్వము తన నిర్ణయాన్ని కమిటీకి అందచేయలేదనివారు తెలిపారు.

అయినప్పటికీ జైలు బయట నున్న కమిటీ సభ్యులు రాత్రి సమావేశమయ్యారు. జైలులో ఉన్న ప్రతిఘటనా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులను కలసుకొని సంప్రతించడానికి ఉద్యమానికి సంబంధించిన కొంతమంది వామపక్ష నాయకులు ప్రయత్నించుతున్నారు.

కలకత్తా మేయర్ శ్రీ నరేశ్ నాథ్ ముఖర్జీ జైలులోపల, బయట వున్న ఉద్యమ నాయకుల ఉద్దేశాలను తెల్సుకోడానికి ప్రయత్నించుతున్నారు.

మధ్యభారత్ బందిపోటు ముఠా నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. దీనివల్ల అక్కడ ఉపద్రవాలు కొంతవరకూ తగ్గవచ్చు ననుకొంటున్నారు.

కలకత్తా పరిస్థితి

శాంతియుతంగానే ఉన్నదని ప్రభుత్వ ప్రకటన

కలకత్తా జులై 18

ఈవేళ కలకత్తాలోని పరిస్థితి చాలవరకు శాంతియుతంగానేఉంది. ట్రామ్ చార్జీలు పెంపుదలను ట్రిబ్యునల్ నిర్ణయానికి వదలివేయడానికి ప్రభుత్వం నిర్ణయించడంతో 114వ సెక్షన్ వగైరా నిర్బంధ శాసనాలఅమలుకూడా చాలవరకు సడలించబడింది.

ప్రతిఘటన కమిటీకలకత్తానగరంలో మూడు సభలనూ, శివారులో మరొక సభను జరుపుకొనగా పోలీసులు ఎలాంటి చర్యా తీసుకోడానికి ప్రయత్నించలేదు.

జులై 15 వ తేదీన పోలీసు కాల్పులకు నిరసనగా జాదవపూర్ - దక్షిణ కలకత్తాలో పూర్తిగా హర్తాలుజరిగింది. అయితే అంతా శాంతియుతంగానే ముగిసింది.

అక్కడక్కడ జరిగిన కొద్దిపాటి సంఘటనల మినహా దాదాపు ఈవేళ పరిస్థితి శాంతియుతంగానే ఉన్నదని ప్రభుత్వ ప్రకటనలో పేర్కొనబడింది.

అగ్రవాల్ మహాసభ

పట్టాభిసీతారామయ్యగారి ప్రారంభోత్సవం

నాగపూర్, జులై 19

వర్తకులు తమ పాత నైతిక స్థాయికి ఎంత త్వరగా చేరుకొంటే దేశానికి అంతమేలు అని అగ్రవాల్ వర్తకుల వార్షిక సమావేశానికి ప్రారంభోత్సవం చేస్తూ మధ్యప్రదేశ్ గవర్నరు శ్రీ భోగరాజు పట్టాభిసీతారామయ్యగారు ఉద్బోధించారు.

తాము వెచ్చించినడబ్బుకు సరైన సరుకు దొరుకుతుందనే విశ్వాసాన్ని వర్తకులు ప్రజల్లో కలిగించాలన్నారు.

పశ్చిమబెంగాలు స్థానిక స్వపరిపాలనమంత్రి శ్రీ ఈశ్వర్‌దాస్ జలన్ సభకు అధ్యక్షతవహించారు

అగ్రవాల్ కులంవారు తమలోవున్న ఘోషా దురభ్యాసాన్ని నిర్మూలించాలని అలాగే వరకట్నాచారాన్ని కూడా రూపుమాపాలని ఆయన ఉపన్యసించారు.

మహాసభకు మద్రాసు గవర్నరు శ్రీ శ్రీప్రకాశ శుభాకాంక్షలను పంపించారు.

నీరాగీతకు లైసెన్సులు

ఇవ్వడంలో ఆలస్యంపై అసెంబ్లీలో ప్రశ్నలు

మద్రాసు, జులై 18

నీరా అనుమతికి లైసెన్సులు ఇవ్వడంలో జరుగుతున్న ఆలస్యంపై నేడు అసెంబ్లీలో పలువురు సభ్యులు ప్రశ్నించారు.

తమ్మిన పోతరాజుగారు ఇలా ప్రశ్నించారు :

"కృష్ణాజిల్లాలో 68 దరఖాస్తులు రాగా ప్రభుత్వం 20 దరఖాస్తులు మాత్రమే మంజూరు చేసింది. మంజూరైన సాపైటీలకు కూడ ప్రభుత్వం లైసెన్సులు యింకా యివ్వలేదు. ప్రభుత్వం నీరాగీత వ్యాప్తి చెందాలనీ, గీత పనివాండ్రకు పని కల్పించాలని వుద్దేశించుతున్నదా ? ప్రభుత్వ విధానమేమిటి ?

జవాబు : నీరాగీతకు అనుమతి ఇవ్వడం ప్రయోగచర్యగా మాత్రమే జరుగుతున్నది. అందువల్ల ప్రభుత్వం ఆలస్యంగా పనిచేయక తప్పదు.

వీరభద్రం : సెయ్యి రుసాయలు సేరుధనం కడితేగాని సొసైటీలను రిజిస్టరు చేయవద్దని ప్రభుత్వం గాని, కో-ఆపరేటివ్ రిజిస్ట్రారుగాని ఉత్తరువులు పంపారా ?

జవాబు : ప్రభుత్వానికి అటువంటి సమాచారం తెలియదు.

కాట్రగడ్డ రాజగోపాలరావు : నీరా అనుమతికి లైసెన్సులు యివ్వడంలో ఆలశ్యం జరుగుతున్నదని జిల్లా మద్యనిషేధ సలహా సంఘం ప్రభుత్వానికి విజ్ఞాపనలు పంపిందా ?

జవాబు : ప్రభుత్వానికి అటువంటి విజ్ఞాపనలేమీ అందలేదు.

గుండాబత్తుల ఆంజనేయులు: నీరా స్కీము విజయవంతమైందని ప్రభుత్వం భావిస్తున్నదా ?

జవాబు : స్కీము విజయం ప్రతిపక్ష సహకారంమీద ఆధారపడివుంది.

మైనేని లక్ష్మణస్వామి: నీరాగీతకు రాయలసీమలో అనుమతి యివ్వకపోడానికి కారణం యేమిటి ?

జవాబు : రాయలసీమలో మద్య నిషేధం సరిగా అమలు జరగడం లేదని ప్రభుత్వానికి రిపోర్టులువచ్చాయి. అందువల్ల ప్రభుత్వం రాయలసీమలో నీరా గీతకు అనుమతి యివ్వడానికి జడిసింది.

(వి. వి.)

ఆంగ్లో-ఈజిప్ట్ చర్చలు

అమెరికన్ పథకం ప్రాతిపదికగా తిరిగి ప్రారంభించేందుకు సన్నాహాలు

కైరో, జులై 18

అమెరికా సూచించిన పథకాన్ని ప్రాతిపదికగా తీసుకొని ఆంగ్లో-ఈజిప్ట్ తగాదా పరిష్కారానికి కొత్త ప్రయత్నం జరిగే సూచనలు కనబడుతున్నాయి.

సూయజ్ కాలువ తగాదా విషయమై బ్రిటనుకు ఈజిప్ట్‌కు లోగడ జరిగిన సంప్రతింపులలో బ్రిటిషు ప్రతినిధి వర్గానికి నాయకత్వం వహించిన జనరల్ సర్ బ్రియాన్ రాబర్ట్‌సన్ రేపు రాత్రి ఇక్కడికి చేరుకుంటున్నాడని తెలుస్తోంది.

ఇటీవల వాషింగ్టన్‌లో జరిగిన అమెరికా, ఫ్రాన్స్ విదేశాంగ మంత్రుల సమావేశంలో ఈయన కూడా పాల్గొన్నాడు. వాషింగ్టన్‌నుండి కొద్ది రోజులక్రితమే లండన్ తిరిగివచ్చాడు. సూయజ్ సమస్యా పరిష్కారానికి ఆసమావేశంలో అమెరికా ఒకకొత్త పథకం సూచించిందట.

ఈయన కైరో రాగానే, సూయజ్ సమస్యపై తిరిగి సంప్రతింపులు ప్రారంభమవుతాయని ఈజిప్ట్ పత్రికలు భావిస్తున్నాయి.

ఈ సంప్రతింపులు మే మాసంలో ఆగిపోయాయి.

"మొన్నటి ఇస్మాలియా ఘటనలు జరిగినప్పటికీ, ఈ జిప్ట్ ప్రభుత్వం బ్రిటన్ ఈజిప్ట్ దేశాలకుగల తగాదాలన్నీ సంతృప్తికరంగా పరిష్కారం కావాలనే నేటికీ వాంఛిస్తూండ"ని ఈజిప్ట్ దేశీయ వ్యవహారాలశాఖ మంత్రి మేజర్ సాలెసాలెమ్ పత్రికా విలేఖరులతో అన్నాడు.

లోగడ జరిగిన ఆంగ్లో ఈజిప్ట్ సంప్రతింపులలో ఈజిప్ట్ ప్రభుత్వం తరఫున ఇతనే పాల్గొన్నాడు.

"వాషింగ్టన్ సమావేశంలో పాల్గొని రాబర్ట్‌సన్ వస్తున్నందుకు చాల సంతోషిస్తున్నా"నని అతనన్నాడు.

జనరల్ నజీబూ, ఈజిప్ట్‌లోని అమెరికన్ రాయబారి గత కొద్ది దినాలుగ సూయజ్ సమస్యను గురించి చర్చించారనీ, ఆ చర్చలలో ఏలాంటి పరిష్కారం తేలకపోయినా, చివరకు సమస్య పరిష్కారమయేందుకు అమెరికా చాల వరకు తోడ్పడుతుందని తాము ఆశిస్తున్నామనీ సాలెమ్ అన్నాడు.

సరకుల సప్లయిపై నిషేధం

ఈలోగా సూయజ్ కాలువ ప్రాంతంలోని బ్రిటిష్ సేవలకు ఈజిప్టు సరకులేవీ అందకుండా ప్రభుత్వం కట్టుదిట్టాలు చేసిందని సాలెమ్ ప్రకటించాడు. ఆ ప్రాంతంలోని ఈజిప్ట్ పలంటీర్లకు ఆయుధాలు కూడా పంచిపెడుతున్నారు. ఇస్మాలియా ప్రాంతంలో తమ సైనికులు కనబడకుండా పోయారన్న వంకతో బ్రిటిష్ వారు అక్కడి ప్రజలమీద ఏవైనా తీవ్ర చర్యకు పూనుకుంటే, ఈజిప్ట్ దేశంలోని ఇతర ప్రాంతాల ప్రజలు చూస్తూ ఊరుకోరన్నాడు.

ఈజిప్ట్ పౌరులపై బ్రిటిష్‌వారి కాల్పులు

బ్రిటిష్ స్థావరంలోకి రాడానికి ప్రయత్నించారన్న సాకుతో బ్రిటిష్ సైనికులు నలుగురు ఈజిప్ట్ పౌరులపై కాల్పులు సాగించారు. ఈవిషయాన్ని కైరోలో బ్రిటిష్‌రాయబారి కార్యాలయంవారే వెల్లడిచేశారు.

తూర్పు జర్మనీలో అమెరికన్ విమానాల దురాగతం

బెర్లిన్, జులై 18

తూర్పు జర్మనీలోని విమానాశ్రయాల మీదికి అమెరికన్ విమానాలు వచ్చి, కరపత్రాలు వెదజల్లి పోయాయి. ఈ దురాగతాన్ని తీవ్రంగా ఖండిస్తూ జర్మనీలోని సోవియట్ హైకమిషనర్, అమెరికన్ హైకమిషనరుకు ఒక నిరసన పత్రాన్ని పంపాడు.

ఫ్రెంచి స్థావరాల నుంచి రాకపోకలకు 'పర్మిట్లు'

త్వరలోనే ప్రవేశ పెట్టనున్నట్లు శ్రీ అరుణ చంద్రగుహా వెల్లడి

మద్రాసు, జులై 18

భారతదేశంలోని ఫ్రెంచి స్థావరాలకు సాగించే రాకపోకలకు ఒక "పర్మిటు" పద్ధతిని ప్రవేశ పెట్టాలని భారత ప్రభుత్వం యోచిస్తున్నట్లు కేంద్ర ఆర్థికశాఖ ఉపమంత్రి శ్రీ అరుణచంద్రగుహా నేడిక్కడ పేర్కొన్నారు.

శ్రీ గుహా నిన్న పాండిచేరి మున్నగు ప్రాంతాలను సందర్శించారు. ఈ ఫ్రెంచి స్థావరాలనుండి సరుకుల దొంగరవాణాలు మితిమీరుతున్నాయని ఈ "పర్మిటు" విధానంవల్ల దొంగరవాణాలను అరికట్టడానికి వీలుంటుందనికూడా ఆయన అన్నారు. ఈ విషయంలో ఫ్రెంచి ప్రభుత్వంతో తాము కలసి ఒప్పందం చేసుకొన దలచుకొన్నామన్నారు.

కౌలాలంపూర్‌లో "తమిళ నెరస్" అనే పత్రిక సంపాదకులు శ్రీ వెంకటరాజులు మలయానుండి మద్రాసు వచ్చారు. మలయాలో పెంట్లాగ్ పాలన చాలా బాగుందని మెచ్చుకున్నారు.

ఆంధ్రరాష్ట్ర బిల్లుకు సవరణలు

అఖిలపక్ష సమాలోచనలు

మద్రాసు, జులై 18

అన్నిపార్టీల ఆంధ్ర నాయకులు నేటి ఉదయం తిరిగి కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ కార్యాలయంలో సమావేశమై ఆంధ్రరాష్ట్ర బిల్లు సవరణలపై చర్చలను కొనసాగించారు.

ఆంధ్రరాష్ట్ర సరిహద్దుల నిర్ణయానికి సరిహద్దుల సంఘం నియమించాలనే సవరణలపై ప్రధానంగా చర్చలు సాగినవట. ప్రభుత్వ సవరణను కూడా ఈ సందర్భంలో చర్చించారట. సరిహద్దుల తగాదాలున్నచోటగాక, హక్కుల ప్రతిపాదన జరిగేచోటకూడా సరిహద్దు సంఘం విచారణజరపాలని కోరటానికి నిర్ణయించారు. బళ్లారి, మోకా, రూపనగుడి ఫిర్కాలలో బ్లైబిసైట్ తీసుకోవాలనే సవరణను బలపరచడానికికూడా తీర్మానించారు.

నెహ్రూ భవనం ఎదుట విద్యార్థుల ప్రదర్శనం

విశ్వవిద్యాలయ సంఘంలో సభ్యత్వ సమస్యపై

అల్లాబాద్, జులై 18

ప్రధాని నెహ్రూ పురాతన గృహం ఆనందభవనం ముందు ఈవేళ దాదాపు మూడు వందలమంది విద్యార్థులు ప్రదర్శనం చేశారు. విశ్వవిద్యాలయాలన్నుండి నినాదాలతో ఊరేగుతూవచ్చిన విద్యార్థులు యూనివర్శిటీ యూనియన్‌లో ఇటీవల ప్రవేశపెట్టబడిన ఐచ్ఛిక సభ్యత్వ పద్ధతిని ఉపసంహరించుకోవాలని కోరారు. ఈ సందర్భంలో జోక్యం కల్పించుకొని తమకు న్యాయాన్ని కల్పించాలని నెహ్రూను వారు అర్థించారు.

చాలా సంవత్సరాలుగా యూనివర్శిటీ యూనియన్‌లో ప్రతి విద్యార్థి తప్పనిసరిగా సభ్యుడుగా ఉండవలసిన ఆచారం ఉంది. దానిని ఇటీవల ఉత్తర ప్రదేశ్‌లోని విశ్వవిద్యాలయాల్లోని వైస్ చాన్సలర్‌లు మార్చి యూనియన్‌లో సభ్యులుగా యిష్టమైన విద్యార్థులు చేరవచ్చునని, సభ్యులుగా తప్పనిసరిగా చేరాలనే నిర్బంధం లేదని నిర్ణయించారు. దానికి వ్యతిరేకంగా విద్యార్థులు ఆందోళన సాగించుతున్నారు.

విద్యార్థి ప్రదర్శకులు తమను నెహ్రూను కలుసుకోనివ్వాలనీ, తమ డిమాండ్లను ఆయనకు వివరించనీయాలని పట్టుబట్టారు. అంతట ఏడుగురితో కూడిన ఒక విద్యార్థి ప్రతినిధివర్గాన్ని నెహ్రూవద్దకు వెళ్ళడానికి చివరకు అనుమతి యివ్వబడింది.

ప్రతినిధివర్గం నెహ్రూతో ఒకగంట సేపున్నారు. అతరువాత నెహ్రూ బయటకువచ్చి ఈ సమస్యపై తన అభిప్రాయాన్ని రేపు విశ్వవిద్యాలయ విద్యార్థుల సభలో ప్రసంగించేప్పుడు తెలియజేయగలనని హామీయిచ్చారు.

మధ్యాహ్నం 2 గంటలకు యూనివర్శిటీ అధికారులు ఏర్పాటు చేసిన విందులో పాల్గొనడానికి నెహ్రూ కారులో వెడుతుండగా మరల విద్యార్థులు ప్రదర్శనం చేశారు.

నెహ్రూ ఆగి 5 నిమిషాలపాటు ప్రసంగించిన తర్వాత విద్యార్థులు వెళ్ళిపోయారు.

శాసనసభవద్ద నిషేధాజ్ఞలు

సభా హక్కులకు భంగకరమని అసెంబ్లీలో ప్రతిపాదన

మద్రాసు, జులై 18

నూతన విద్యావిధానానికి వ్యతిరేకంగా శాసనసభకు విజ్ఞాపనలు అందజేయడానికి ప్రజాసంఘాల ప్రతినిధులు ప్రభుత్వ భవనం ఎస్టేట్‌లోకి ప్రవేశించ ప్రయత్నించినపుడు పోలీసులు వారిని అటకాయించడం సభా హక్కులకు భంగకరమని స్వతంత్ర సభ్యుడు శ్రీ రంగస్వామి రెడ్డియార్ నేడు అసెంబ్లీలో తీర్మానం ప్రతిపాదించారు. దానిని స్పీకర్ త్రోసివేశారు.

శ్రీ రెడ్డియార్ తన తీర్మానాన్ని వివరిస్తూ, ప్రజాసంఘాలప్రతినిధులు తన ద్వారా శాసనసభకు విజ్ఞాపనలు అందజేయ దలచారని, ప్రతిసభ్యునికీ మహజర్లు తీసుకునే హక్కు వుందని, పోలీసుల కిక్కబడ్డ ఉత్తర్వు ఆహక్కుకు భంగకరమని పేర్కొన్నారు. దీనిపై నివారణ జరపటానికి ఒక కమిటీని నేయాలని కోరారు.

ముఖ్యమంత్రి రాజగోపాలాచారి మాట్లాడుతూ, ఈ సమస్యపై సభ్యులు పోరాడదలచుకుంటే నిర్మొగమాటంగా పోరాడటం మంచిదన్నారు. అసెంబ్లీ వద్ద ప్రదర్శనాలు జరుపుతామనే బెదరింపుల దృష్ట్యా నిషేధాజ్ఞలు జారీచేయబడినాయని తెలిపారు.

"సభ్యులకు మహజర్లు తీసుకోడానికి హక్కువుంది. కాని శాసన సభ్యుల హాస్టళ్లలో నివసిస్తూ, నిషేధ ఉత్తర్వులను అధిగమించాలంటే సాధ్యంకాదు. శాసనసభ్యులకు లోపలికి జన సమూహాలను పిలుచుకొని రావడానికి హక్కులేదు" అన్నారు.

స్పీకర్ తీర్మానాన్ని త్రోసివేశారు.

మే 17 న ధారాపురంలో ముఖ్యమంత్రివద్దకు రాయబారం నడపటానికి శాసనసభ్యుడు శ్రీ యస్. కె. పళనిస్వామి ప్రయత్నించగా ఆయనను పోలీసులు అరెస్టుచేయడం సభాహక్కులకు భంగకరమని కమ్యూనిస్టు సభ్యుడు శ్రీ కె. పి. గోపాలన్ మరొక ప్రతిపాదన తెచ్చారు.

శ్రీ గోపాలన్ తన తీర్మానాన్నివివరించబోగా ముఖ్య మంత్రి లేచి తనకు నిన్ననే ఈ తీర్మానం అందినదని, సమాచారంకోసం పంపానని చెప్పారు. అందుచేత సోమవారంనాడు ఈ సమస్యను చర్చించవచ్చునన్నారు.

స్పీకర్ అందుకు అంగీకరించి ప్రతిపాదనపై చర్చను సోమవారంనాటికి వాయిదా వేశారు.

ఒరిస్సా కాంగ్రెసులో ముసలం

హరికృష్ణమెహతాబ్, ముఖ్య మంత్రి చౌదరీలు రాజకీయాలనుండి తప్పుకొంటామని బెదరింపు

కలకత్తా, జులై 18

కాంగ్రెసు పార్లమెంటరీపార్టీ ప్రధాన కార్యదర్శి పదవికి రాజీనామా యివ్వవలచుకొన్న శ్రీ హరికృష్ణ మెహతాబ్ తన పార్లమెంటు సభ్యత్వానికీ, ఎ.ఐ.సి.సి. సభ్యత్వానికీ రాజీనామాయిచ్చే విషయమై కాంగ్రెసుఅధ్యక్షుడైన శ్రీ నెహ్రూతో ఉత్తర ప్రత్యుత్తరాలను సాగించుతున్నట్లు తెలుస్తోంది.

తన స్వరాష్ట్రమైన ఒరిస్సాలో పూర్తిగా నిర్మాణ కార్యక్రమంలో నిమగ్నం కావాలనే దృష్టితోనే తానీ రాజీనామాలను యివ్వడానికి ఉద్దేశించినట్లు ఆయన చెప్పుతున్నారు.

ఒరిస్సా ముఖ్యమంత్రి శ్రీ నవకృష్ణ చౌదరికూడా పార్టీ నాయకత్వాన్నుండి ముఖ్యమంత్రి పదవినుండి తప్పుకుంటానని మంత్రివర్గంలోని తన సహచరులకూ రాష్ట్ర కాంగ్రెసు కమిటీకి తెలియజేసినట్లు తెలుస్తోంది. ఆచార్యవినోబా భూదాన ఉద్యమంలో తాను పాల్గొనదలచానని ఆయన తెలుపుతున్నారు. పార్టీ నాయకుడుగా కాక అనధికార హోదాలో భూదాన ఉద్యమంలో పాల్గొనడం ఉచితమని ఆయన అభిప్రాయపడుతున్నారట.

అయితే పార్టీ సభ్యులు ఆయన రాజీనామాను ప్రస్తుతం సమ్మతించకపోవచ్చునని కాంగ్రెసు వర్గాలలో తెలుస్తోంది.

కాశ్మీర్ రాజ్యాంగం

శ్రీనగర్, జులై 18

కాశ్మీర్ రాజ్యాంగసభ శాసనసభా కార్యక్రమాన్ని నెరవేర్చేందుకు అక్టోబరు మొదటివారంలో సమావేశమవుతోంది. రాజకీయ వాతావరణం కొంతవరకు స్పష్టమైన తరువాతగాని రాజ్యాంగ నిర్మాణానికి సంబంధించిన కార్యక్రమాన్ని తీసుకోదలచలేదని పి. టి. ఐ. రాజకీయ విలేఖరి వ్రాస్తున్నారు.

ఈ లోపున జాతీయ మహాసభ వర్కింగ్ కమిటీలో వెలిబుచ్చబడిన అభిప్రాయాలననుసరించి ప్రాథమిక సూత్రాల కమిటీ, ప్రధాన హక్కుల కమిటీలు భవిష్యత్తు కాశ్మీర్ రాజ్యాంగ చట్టం ముసాయిదాను తయారు చేయడానికి ప్రయత్నించుతాయి.

సమ్మె దారులకు ప్రజానీకం అండ

బొంబాయి, జులై 18

బొంబాయి రాష్ట్ర ట్రేడ్ యూనియన్ అధ్యక్షులు శ్రీ ఎస్. ఎస్. మిరాజ్‌కర్ సింగరేణి కాలరీస్ యూనియన్ పోరాటానికి సానుభూతి తెలుపుతూ ఈవిధంగా వ్రాశారు:

"చందాల రూపంలో యేమాత్రం వచ్చినా వెంటవెంటనే బొంబాయి రాష్ట్ర ట్రేడ్‌యూనియన్ కాంగ్రెస్ ద్వారా మీకు అందచేయబడుతుంది."

మధ్యప్రదేశ్ గనికార్మిక సంఘం, తెలంగాణా రైతుసంఘం, ఇతర ప్రజా సంఘాలు, సమ్మె దారులయెడ సానుభూతి తెలుపుతూ, సహాయనిధి ముందుకు వస్తున్నాయి.

దాల్మియాపురం కాల్పుల విచారణ ప్రారంభం

తిరుచునాపల్లి, జులై 18

తిరుచునాపల్లి జిల్లా కలెక్టరు శ్రీ శంకరమీనన్, సబ్జడ్జీ జడ్జి శ్రీ హరిహర అయ్యర్, నేడు దాల్మియాపురం కాల్పులపై విచారణ ప్రారంభించారు.

దాల్మియాపురం పేరును మార్చి దాన్ని "కల్లకుడి" అని పిలవాలని ద్రావిడకజగంవారుమూడురోజుల క్రింద ఆందోళన చేసినప్పుడు పోలీసులు కాల్పులు చేయగా ఏడుగురు మరణించిన సంగతి పాఠకులకు విదితమే.

సంయుక్త కర్ణాటక

వెంటనే ఏర్పడ్డాలని మైసూరు కౌన్సిల్‌లో పలువురు వక్తల ప్రసంగం

బెంగుళూరు, జులై 18

నేటి మైసూరు ఎగువ శాసనసభ (కౌన్సిల్)లో ఆంధ్రరాష్ట్ర బిల్లు చర్చకు వచ్చింది. బిల్లుపై మాట్లాడిన వారిలో పలువురు పరిసర కన్నడ ప్రాంతాలను మైసూరులో చేర్చి సంయుక్త కర్ణాటక రాష్ట్రాన్ని వెంటనే నిర్మించాలని కోరారు.

"ఏ"తరగతి రాష్ట్రంలోని ప్రాంతం కొంతకలిసింది కాబట్టి మైసూరునుకూడ "ఏ"తరగతి రాష్ట్రంగానే పరిగణించాలని కొందరన్నారు. బళ్ళారిసమస్యను మరల తిరగతోడరాదని కూడ అంతా అన్నారు.

బళ్ళారి ఆందోళనలో శిక్షితుల విడుదల

మద్రాసు ప్రభుత్వ ఉత్తర్వు

మద్రాసు, జులై 18

బళ్ళారి తగాదా విషయంలో 4 పక్షం రోజులుగా చట్ట విరుద్ధ చర్యలు జరుగనందున, ఆ సందర్భంలో అరెస్టు చేయబడిన వారిపై శిక్షలను రద్దు చేయడానికి ప్రభుత్వం నిశ్చయించింది. వారందరూ వెంటనే విడుదల చేయబడతారు. అయితే వ్యక్తులపైన, ఆస్తులపైన నేరాలు చేసిన వారికి ఈ సౌకర్యం వర్తించదు.

ఈ సందర్భంలోనే ప్రస్తుతం జరుగుతున్న ప్రాసిక్యూషన్లు సెక్యూరిటీ వ్యవహారాలు కూడా ఉపసంహరించబడతాయి.

విజయవాడ విశేషాలు

ఫైర్‌స్టోన్ కంపెనీ

ఆంధ్ర ప్రాంతాలకు సెల్సుడిపో ప్రారంభం

విజయవాడ, జులై 18

ఆంధ్ర జిల్లాలకు ప్రత్యేకించి ఫైర్‌స్టోన్ సేల్సుడిపోను నిన్న యిచ్చట ప్రారంభించారు. ఇండియాలో ఫైర్‌స్టోన్ కంపెనీ సేల్సు డైరెక్టర్ మిస్టర్ ఏ. ఏ. బీవర్ ప్రారంభోత్సవం జరిపారు.

ఈ సందర్భంలో జరిగిన సభలో ప్రసంగిస్తూ బీవర్, భారత దేశంలో రబ్బరు పుష్పత్తిని అధికం చేయడానికి చాలాఅవకాశం వున్నదనీ, ప్రస్తుతం పరిశ్రమకు కావలసిన రబ్బరు 24 వేల టన్నులుంటే, ఉత్పత్తి అవుతున్నది 16 వేల టన్నులుమాత్రమే నని చెప్పారు.

"ప్రస్తుతం భారతదేశంలో రెండు టైర్ల ఫ్యాక్టరీలున్నాయి. ఇందులో ఉత్పత్తి అయిన సరుకు భారతదేశ వినియోగానికిపోను, ఇతర దేశాలకుకూడా ఎగుమతి చేస్తున్నాం. అందుచేత ప్రత్యేకంగా భారతీయుల నెట్టబడితో మరో ఫ్యాక్టరీ నెలకొల్పటానికి అవకాశంలేదు." అని బీవర్ అన్నాడు.

విజయవాడ బ్రాంచి మేనేజరు శ్రీ పచ్చయ్యగారు ఆవ్యోనితులకు స్వాగతం చెప్పారు.

శ్రీ గౌని వీరారెడ్డి నిరశనవ్రతం

మిత్రా అవార్డుకు నిరసనగా శ్రీ గౌని వీరారెడ్డిగారు ప్రారంభించిన నిరశనవ్రతం నేటికి 15 రోజులయింది. వీరారెడ్డిగారు చాలా బలహీనంగా వున్నారు. మరో వారం రోజులకు-21 రోజులు పూర్తయ్యాక-నిరశనవ్రతం ముగుస్తుంది.

నేడే చూడండి

ఆంధ్రదేశ మంతటా ప్రదర్శింప బడుతున్న

నగరంలో సినిమాలు 20—7—53

శ్రీ సరస్వతి

ఒక తల్లి పిల్లలు

లలిత, పద్మిని

3 వ వారం మూడు ఆటలు

శ్రీ మారుతి సినిమా

ఆఫోష్ (హిందీ)

మూడు ఆటలు

శ్రీ లీలామహల్

మెట్రోవారు 3 కోట్ల 92 లక్షల రూపాయలు ఖర్చుపెట్టి 12 సం॥ లు కృషిచేసి తయారుచేసిన పంచ రంగుల చిత్రము.

QUO VADIS కోవాడిస్

3 ఆటలు

ఉదయం 9-12 గం॥ మధ్య 1-14-0, 0-14-0 రేట్లకు అడ్వాన్సుగా టిక్కెట్లు యివ్వబడును.

శ్రీదుర్గాకళామందిరం

ప్రపంచం

జి. వరలక్ష్మి, రామశర్మ

2 వ వారం మూడు ఆటలు

శేష్ మహల్

రఘూంజర్ (హిందీ)

కామినీకౌశల్, దిలీప్‌కుమార్

మూడు ఆటలు

కొత్త బ్రిటిష్ ప్రధాని

ఆంథోనీ ఈడెన్ కావచ్చునట

లండన్, జులై 19

సెప్టెంబరు, అక్టోబరు ఆ ప్రాంతములో, చర్చిల్ స్థానంలో బ్రిటిష్ ప్రధానిగా ఆంథోనీ ఈడెన్ నియామకం జరగవచ్చునని 'సండే క్రానికల్' పత్రిక రాజకీయ విలేఖరి తెలిపాడు.

చర్చిల్ ఇక రంగంలోనుంచి విరమించుకొని, అధికారాన్ని ఈడెన్‌కు అప్పగిస్తాడని పార్లమెంటులో అన్నిపక్షాల వారు అనుకుంటున్నారన్నాడు. ఈడెన్ తన ఆరోగ్యాన్ని పూర్తిగాకోలుకోవడమే తరువాయిట.

ప్లానింగ్ బోర్డులలో శాసన సభ్యులందరికీ స్థానం

ఇవ్వడానికి ప్రభుత్వ నిరాకరణ

మద్రాసు, జులై 18

ఆయా జిల్లాల ప్లానింగ్ బోర్డులలో జిల్లా శాసనసభ్యులందరినీ చేర్చుకోవాలని నేడు అసెంబ్లీలో ఒక కమ్యూనిస్టు సభ్యుడు చేసిన సూచనను ముఖ్యమంత్రి నిరాకరించారు. ఒకే తరహా వ్యక్తులకు అన్ని గౌరవస్థానాలూ కట్టబెట్టడం మంచిదికాదన్నారు.

శాసనసభ సమావేశాలు జరుగుతున్నపుడే ప్లానింగ్ బోర్డులను జిల్లా కలెక్టర్లు సమావేశ పరుస్తుంటారని ఒకరు తెలుపగా, అందుచేతనే అసెంబ్లీ సభ్యులకు వాటిలో స్థానం ఇవ్వడం లేదన్నారు.

సంపాదకుడు, ముద్రాపకుడు, ప్రచురణకర్త :— కాట్రగడ్డ రాజగోపాలరావు, ముద్రణ :— స్వతంత్ర కమర్షియల్స్ లిమిటెడ్ వారి స్వతంత్ర ఆర్ట్ ప్రింటర్స్, బకింగ్‌హాంపేట, విజయవాడ. సంపాదకవర్గం :— మోటూరు హనుమంతరావు (అధ్యక్షుడు) కొండంపాటి సత్యనారాయణ, కాట్రగడ్డ రాజగోపాలరావు

ఈ గ్రంథాన్ని నేడే చదవండి

ఆంధ్రరాష్ట్రం అవతరిస్తున్నది. కనుచూపుమేరలో విశాలాంధ్ర కానవస్తున్నది. వివిధ రాష్ట్రాల్లో విసిరివేయబడ్డ ముక్కోటి తెలుగువారు ఒక్కటి కావాలనే ప్రబల వాంఛతో అడ్డంకులనన్నింటినీ దాటి ఒకరితో ఒకరు చెట్టా పట్టాలు కట్టుకొనడానికి వస్తున్నారు.

గతంలో జాతిమధ్య అనేక పర్యాయాలు అడ్డగోడలు మొలిచాయి. తెలుగువారు ఆ గోడలను కూలగొడుతూ వచ్చారు. ఇప్పుడు మరొకమారు ఈ అడ్డుగోడలను పునాదులతో సహా పెకలించివేయడానికి సంసిద్ధులుగా వున్నారు.

అయితే గతంలో ఈ అడ్డుగోడలు ఎవరు పెట్టారు? వాటిని జాతి ఎలా కూలకొట్టింది. తెలుగువారిలో నేడు పొంగులువార